

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :13 సంచిక: 4 హైదరాబాద్ 2013 జూలై పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# మెహెరాబాద్‌లో యువజన సమ్మేళనం

2013 ఆగస్టు 26 నుండి సెప్టెంబరు ఒకటో తేదీ దాకా మెహెరాబాద్‌లో 11వ యువజన సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల యువత ఈ సమ్మేళనంలో పాల్గొనవల్సిందిగా కోరుతున్నారు. మరిన్ని వివరాలకు

http://ambppct.org/yas.php.,http://ambppct.org/ApplicationForm.php. అంతర్జాలంలో సంప్రదించగలరు.

# ధర్మశాల 8వ వార్షికోత్సవం

మెహెర్‌స్థాన్ ధర్మశాల 8వ వార్షికోత్సవం 2013 జూలై 28, ఆదివారం ఉదయం 7.30 నుండి సాయంత్రం 5.30 వరకు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ వై.ఎస్. రావు (98481 11671) ఒక ప్రకటనలో తెలిపారు. మెహెరాబాద్ నుండి శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ తదితరు బాబా ప్రేమికులు విచ్చేస్తున్నారని ఆయనన్నారు. స్థానికంగా గల బాబా ప్రేమికులందరు విచ్చేసి ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

# ఎర్రని చిరునామాలు

**2011 నుండి వార్షిక సభ్యత్వం చెల్లించని సభ్యుల చిరునామాలను పూర్తిగా తొలగించడమైంది. కాగా 2012 జనవరి, ఆ తదుపరి మాసాల నుండి వార్షిక సభ్యత్వం చెల్లించని వారి చిరునామాలను ఈ సంచిక కవరుపై ఎర్రని రంగులో హెచ్చరికగా పంపుతున్నాం. దయచేసి గమనించి బాబా ప్రేమికులు తక్షణమే వారి వార్షిక సభ్యత్వం చెల్లించి సహకరించగలరు. లేనిఎడల ఆయా సభ్యులకు పత్రికలు పంపడం నిలిపివేయవలెనని నిర్ణయించడమైంది. దయచేసి గమనించగలరు. అలాగే, జీవితసభ్యత్వంలో రూ 500 మాత్రమే చెల్లించినవారు కూడా వారి బాకీ నగదు రూ 500 వెంటనే చెల్లించవలెనని మనవి.**

## హెల్ప్‌లైన్

మెహెర్‌బాబా పత్రికను ప్రతి నెలా 25వ తేదీ లోగా మీకు అందడంలో ఆలస్యమైతే శ్రీ వి. ఆర్. కె. శాస్త్రి, హైదరాబాద్ (98492-42284), లేదా శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ వార్షిక, జీవిత సభ్యత్వం సక్రమంగా చెల్లించి సహకరించవల్సింది.**

## బాబా సందేశం

పొగడ్తలు - ప్రశంశలు - అవమానాలు - ఛీత్కారాలు, నీ మనస్సుని తాకకపోతే, నీవు వాటిని పట్టించుకోకపోతే, నీవు ఎప్పుడూ ఆనందంగా వుండగల్గుతావు.

**It Praise and insult do not affect you, you should be always happy**

- మెహెర్‌బాబా.


**గౌరవ సంపాదకులు**

**మల్లాది కృష్ణానంద్**

**99595-53218,**

**krishnanandm@yahoo.com**

**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**

**దశిక ప్రసాదరావు**

**040-65699611**


## లోపలి పేజీలలో...


1. సంపాదకీయం 5
2. మౌనంలో మెహెర్‌బాబా 6-8
3. అవతారుడు - సంస్కారములు 9-10
4. అవతారుడు - శిష్యకూటమి 11-14
5. మీరెంతో అదృష్టవంతులు 15-16
6. బాధలెందుకు? 17-19
7. లార్డ్ మెహెర్ 20-30
8. డా॥ భరూచా!! 31
9. కొత్త పుస్తకాలు 32
10. డాక్టర్ ఘనీతో మా జ్ఞాపకాలు 33-37
11. ప్రార్ధనలు



**ఉత్తర ప్రత్యుత్తరాలకు**

ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


### మనవి

మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.

Please visit : www.srimeherbaba.com

# గుంటూరు బాబా సెంటర్ స్వర్ణోత్సవాలు

గుంటూరు బాబా సెంటర్ స్వర్ణోత్సవాలు 2014 మార్చి 1,2 తేదీలలో మంగళగిరి రోడ్డులో గల అవతార్ మెహెర్‌బాబా మందిరంలో భారీఎత్తున ఏర్పాటుచేసినట్లు బాబా ప్రేమికులు శ్రీ కనకయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రత్యేక కార్యక్రమం

**2013 సెప్టెంబరు 1, ఆదివారం, సాయంత్రం 6.30 నుండి 8.30 వరకూ**

స్వర్ణోత్సవాలలో భాగంగా 2013 సెప్టెంబరు 1, ఆదివారం, సాయంత్రం 6.30 నుండి 8.30 వరకూ గుంటూరులోని బృందావన్‌గార్డెన్స్‌లో గల శ్రీ వెంకటేశ్వర దేవాలయ ప్రాంగణం - కళావేదికలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేశామని బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని శ్రీ కనకయ్య కోరారు.

# రాజాం సెంటర్ వార్షికోత్సవం

రాజాం సెంటర్ వార్షికోత్సవం సెప్టెంబరు 15, 2013 ఆదివారం ఉదయం నుండి ఏర్పాటుచేసినట్లు కార్యదర్శి శ్రీ పి.వి. రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులందరూ తప్పక వీలుచూసుకుని హాజరుకావాలని ఆయన కోరారు.

# శ్రీకాకుళం సెంటర్ 52వ వార్షికోత్సవం

శ్రీకాకుళం సెంటర్ 52వ వార్షికోత్సవం ఆగస్టు 18, 2013 ఆదివారం ఉదయం నుండి ఏర్పాటుచేసినట్లు కార్యదర్శి శ్రీ పి. రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులందరూ తప్పక వీలుచూసుకుని హాజరుకావాలని ఆయన కోరారు.

# నిజామాబాద్ బాబా సెంటర్ స్వర్ణోత్సవాలు

నిజామాబాద్ బాబా సెంటర్ 50వ వార్షికోత్సవం 2013 నవంబరు 9,10 రెండవ శనివారం, ఆదివారంలలో ఏర్పాటుచేసినట్లు కార్యదర్శి శ్రీ ఏ. జనార్ధనరావు (09908785774) ఒక ప్రకటనలో తెలిపారు.

బాబా ప్రేమికులందరూ వీలుచూసుకుని తప్పక హాజరుకావాలని, విచ్చేసే వారి వివరాలు సెప్టెంబరు 30లోగా తెలియజేయాల్సిందిగా ఆయన కోరారు.



# ప్రార్థించుదాం!!

అవతారుని మండలి సభ్యులు సామాన్య బాబా ప్రేమికుల మాదిరిగా నిరాడంబరంగా కనిపిస్తారు. వారు నిరాండంబరతకే నిర్వచనం!
కానీ వారు అసమాన్యులు.
మెహెర్‌బాబా కూడా తన మండలి సభ్యులు చాలా ప్రత్యేకమైనవారని, వారెంతో అదృష్టవంతులనీ పలు సందర్భాలలో బాహాటంగానే ప్రశంశించారు.
ప్రతి అవతారకాలంలో అవతారుడు తనతోపాటుగానే తాను ఎంపిక చేసుకున్న శిష్యకూటమిని ఈ భూమిపైకి తీసుకువస్తాడు. మండలి సభ్యులైన ఏరుచ్, భావూజీ తదితరులను అవతారుని మండలి సభ్యులుగా ఎలా ఎంపిక చేసుకున్నారో, వారెలా వచ్చి మండలిలో చేరారో పాఠకులకు బాగా తెలుసు. సుమారు 20-24 సంవత్సరాల వయస్సులో తనవారిని, వారి యావదాస్థుల్ని వదలి బాబా దగ్గరకు వారు వచ్చి చేరిపోయారు. 1950వ దశకం నాటికే ఏరుచ్ ఇంజనీరింగ్ చదువు పూర్తిచేశాడు. భావూజీ నాగపూర్ విశ్వ విద్యాలయం నుండి ఎం.ఏ పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు.
అవతారుడి మండలిగా ఎంపిక కావాలంటే ఎన్నో జన్మల పుణ్యఫలం కావాలి.
ఈ ద్వంద ప్రపంచంలో జన్మించిన అవతారుడి శిష్య కూటమి విజ్ఞానీ సంస్కారాలు కలిగివుంటారు. విజ్ఞానీ సంస్కారాలు భగవదైక్యానికి ప్రవేశ ద్వారాలు.
సాధారణ మానవులు ప్రారబ్ధ సంస్కారాలు, అవతారుడు, సద్గురువులు యోగాయోగ సంస్కారాలు కలిగి ఉంటారని మెహెర్‌బాబా పలు సందర్భాలలో స్పష్టం చేశారు.
అవతారుని శిష్యవర్గం మొత్తం 122 మంది ఉంటారు. సద్గురువుల శిష్యకూటమి 12 మందిని మించి ఉండదు. ఏతావాతా చెప్పొచ్చేదేమంటే,
ఈ అవతార కాలంలో అవతారుని మొత్తం శిష్యవర్గంలో నేడు మన మధ్యన ఉన్నది బాబా ట్రస్టు చైర్మన్‌గా ఉన్న భావూ కల్చూరీ (86) ఒక్కరే. పేరు పేరునా ప్రేమతో పలకరించే భావూజీ బాబా ప్రేమికులందరికీ సుపరిచితుడే. బాబా ప్రవచనాలను తు.చ. తప్పక ఆచరణలో అమలు చేసిన ధన్యజీవి భావూజీ. ఆయన ఆరోగ్యం కొంతకాలంగా బాగా లేదు. భావూజీ ఆరోగ్యం మెరుగు కోసం ప్రతి బాబా సెంటర్‌లో కొద్దిసేపు అవతారుడుని మనసారా ప్రార్థించుదాం.
ఇది అవతారుడు కల్పించిన అవకాశంగా భావించుదాం.
భావూకు త్వరలో స్వస్థత చేకూరుతుందని ఆశిద్దాం! ❀

# మౌనంలో మెహెరాబాద్

2013 జూలై 10 నాడు బాబా ప్రేమికులు చాలా మంది మౌనం పాటించారు. ఇందుకోసం తెలుగునాట గల బాబా సెంటర్లలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. మెహెర్‌స్థాన్, కొవ్వూరులో, హైదరాబాద్‌లోని కోఠి, జూబ్లీ బాబా సెంటర్లలో, అలాగే మంచిర్యాల ఆదిలాబాద్ జిల్లా, కరీంనగర్, సిరిసిల్లా, సంగారెడ్డి, గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం, ఏలూరు, తాడేపల్లిగూడెం, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ మరి ఇతర అనేక సెంటర్లలో బాబా ప్రేమికులు మౌనం పాటించినట్లు సమాచార భోగట్టా.

కాగా, ఈ ఏడాది మౌన వార్షికోత్సవంలో సుమారు రెండు వేల మందికి పైగా పలు ప్రాంతాల నుండి మెహెరాబాద్‌కు విచ్చేసారు. మెహెరాబాద్‌లోని బాబా ట్రస్టు నిర్వహిస్తున్న **డి – హాస్టలు, మెహెర్ పిలిగ్రిం రిట్రీట్‌లతో పాటు ఆంధ్రా రెస్టు హౌసులో** బాబా ప్రేమికుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేశారు. మెహెరాబాద్‌కు కొందరు మెహెర్ ప్రేమికులు జూలై 6, 7 తేదీలకే చేరుకున్నారు. జూలై 12న ధుని కార్యక్రమం కూడా దర్శించుకుని, ఆ మర్నాడు శనివారం  కొందరు, ఆదివారం అధికశాతం తమ గమ్యాలకు తిరుగు ప్రయాణం కట్టారు. విచ్చేసిన మెహెర్ ప్రేమికులలో తెలుగువారు ఎక్కువగా ఉన్నట్లు కనిపించినా, ఇతర ప్రాంతీయులూ అధిక సంఖ్యలోనే ఉన్నారు. జూలై 10న ఉదయం 7 గంటలు  తర్వాత బాబా దర్శనార్థం క్యూలో నిలుచున్నవారికి బాబా దర్శనం 4 గంటలు తర్వాత లభించింది. నాలుగైదు వరుసలలో క్యూలు ఏర్పాటు చేసినా, క్యూ పొడవు చాలా దూరమే కనపడింది. మౌన దినం నాడు ఉదయం 7 గంటలకు మౌనంగానే బాబా ప్రేమికులు ప్రార్థనలు నిర్వహించారు. ఎగువ, దిగువ మెహెరాబాద్‌లలో జూలై 10న ప్రశాంత వాతావరణంలో చల్లని గాలుల నడుమ మౌనం రాజ్యమేలింది. ఐతే, ఈ దఫా కొట్టొచ్చినట్లు కనిపించిన విశేషం ఏమంటే  యువత చాలా తక్కువ శాతం ఈ కార్యక్రమానికి వచ్చారు. బహుశా వారి కాలేజీలు లేదా ఆఫీసు పనులు వల్ల వారు హాజరు కాలేకపోయారని అన్నారు. అలాగే, వయస్సురీత్యా పెద్దవారు, ముఖ్యంగా ఆడవారు మోకాలు నెప్పులతో నడవలేక నానా ఇబ్బందులు పడుతూ  కనిపించారు. ఈ విషయంలో ఆంధ్రా రెస్టు హౌసు ఒక మంచి ఆలోచన చేశింది. గత మూడేళ్ళుగా వారు బాబా సమాధికి వెళ్ళేందుకు తిరిగి వచ్చేందుకు ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు. పైకి ఏమనకపోయినా ఇది చాలామందికి బాబావారు కల్పించిన మంచి సౌకర్యంగా భావిస్తున్నారు. ఐతే ఇదే విషయంలో ట్రస్టువారు కూడా తగిన ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## పెద్ద వాన

జూలై మాసపు చల్లని గాలులు, అప్పుడప్పుడు పడుతున్న చిరుజల్లులు, పచ్చని మొక్కలు, వృక్షాలతో ఉదయం నుండి సాయంత్రం వరకూ మెహెరాబాద్ చాలా ప్రశాంతంగా, హాయిగా ఉంది. జూలై 12 ధుని వెలిగించే రోజున మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం 8 గంటలు దాకా పెద్ద కుండపోత వాన కురిసింది. ధుని వెలిగించే సమయంలో కూడా పెద్దవాన కురుస్తూనే వుంది. అలా ఆ వానలో తడుస్తూనే పిల్లా పెద్దలందరూ ధుని కార్యక్రమంలో పాల్గొన్నారు. ధుని సందర్భంగా బాబా సమాధి ప్రాంగణంలో సాయంత్రం ఆరు గంటలకే బాబా ప్రార్థన, ఆరతులు జరిగాయి. మునుపెన్నడూ ఊహించనంత వర్షం మెహెరాబాద్‌లో కురిసిందని స్థానికులు అన్నారు.

## మెహెరాజాద్ యాత్ర

జూలై 9, అలాగే 11 తేదీలలో బాబా ప్రేమికులను మెహెరాజాద్‌కు ప్రత్యేక బస్సుల్లో తీసుకెళ్ళారు. అక్కడ బాబావారి గదిని, మండలిహాలును సందర్శించారు. గతంలో మాదిరిగా కాకుండా ఈ దఫా కొన్ని క్రొత్త నిబంధనలు కనిపించాయి. గతంలో బ్లూ బస్ లోపలికి వెళ్ళి చూసివచ్చేవారు. అలాగే బాబావారి గది ప్రక్కనే వున్న మెహెరామాయి గదికి కూడా వెళ్ళేవారు. ఈసారి మెహెరామాయి గదికి వున్న వరండాపైన, అలాగే బ్లూ బస్ గుమ్మం బయటనే బాబావారి ఫోటోనొకదాన్ని ఉంచి లోనికి ప్రవేశాన్ని నిషేధించారు. కాగా, ఈసారి చాలా మంది బాబా ప్రేమికులు బాబా గది వెనుకనే వున్న మనోనాశ్ కొండ శిఖరాగ్రం దాకావెళ్ళి చూసి వచ్చారు. వయస్సురీత్యా పెద్దవాళ్ళు కూడా చాలా మంది ఈ కొండను ఎక్కారు. కొండ పైదాకా ఎక్కేందుకు వీలుగా తగిన మెట్లులాంటి ఏర్పాట్లు అక్కడక్కగా చేశారు. ఇది బాబా ప్రేమికులకెంతో వీలుగా వుంది. ఈ మాదిరి ఏర్పాట్లు గతంలో లేవని, బహుశా ఇటీవలనే ఈ ఏర్పాట్లు చేశారని పలువురు అభిప్రాయపడ్డారు. ఇకపై మీరు ఎప్పుడైన **మెహెరాజాద్** వెళ్ళగల్గితే మనోనాశ్ కొండను తప్పక సందర్శించండి. కొద్దిపాటి ఆరోగ్యం వుండి ఆరోగ్యరీత్యా పెద్ద ఇబ్బందులు లేనివారెవరైనా ఈ కొండను అవలీలగా ఓ 20 నిముషాలలో శిఖరాన్ని చేరుకోవచ్చు. అక్కడ బాబా నిర్వహించిన మనోనాశ్ ప్రాంతాన్ని చూడొచ్చు. ఈ సమయంలో ఈ కొండ కూడా పచ్చని మొక్కలతో, వృక్షాలతో కళకళలాడుతోంది. జూలై 11న దిగువ మెహెరాబాద్ ఆడిటోరియంలో అవతారుని చలనచిత్ర ప్రదర్శన, ఆ మర్నాడు ఉదయం గజల్సు కార్యక్రమం ఏర్పాటుచేశారు.

## ఆంధ్రా గెస్టుహౌసు

ఆంధ్రా గెస్టుహౌసు **ఫుల్ కెపాసిటీ** 450 మందికి భోజన వసతి సౌకర్యం కల్పించింది. వృద్ధులు, ఆరోగ్యరీత్యా అంతంతమాత్రంగా వున్నవారికి ఆంధ్రా గెస్టుహౌసు చక్కని బస

ఇచ్చింది. గతంలోని డైనింగ్‌హాలుని మహిళలకు ప్రత్యేక వసతిగదిగా మార్చారు. అదే సమయంలో విశాలమైన 16 అడుగుల వెడల్పు 85 అడుగుల పొడవు గల పెద్ద విశాలమైన డైనింగ్ హాలు ఉత్తర దిక్కులో ఏర్పాటుచేశారు. స్థానికంగా నీటి ఎద్దడి వున్నా ట్యాంకర్లుతో నీటిని తెప్పించి బస చేసిన ప్రేమికులకు ఎలాంటి ఇబ్బందికల్గకుండా జాగ్రత్తపడ్డారు. ఐతే, కొనుగోలు చేసిన నీళ్ళు అని తెలిసికూడా మహిళలు తమ దుస్తులు ఉతికి ఆరేయడంలో ఏమాత్రం నియంత్రణ పాటించ లేదు. ప్రస్తుతం నీటి కోసం రూ 1.50 లక్షలు ఖర్చు చేసి 700 అడుగుల లోతున బోరు బావి తవ్వించారు. తద్వారా రెండు గంటలపాటు బోరు నీళ్ళు లభిస్తున్నాయి. ఏమైనా నీటి ఎద్దడి తీవ్రంగా గల ఈ దుర్భిక్ష ప్రాంతంలో భవిష్యత్ అవసరాల కోసం తగిన నిధులు సమకూర్చుకోవల్సిన అవసరం ఉంది. ఇందుకోసం జలనిధి పేరిట ప్రత్యేక బ్యాంకు అక్కౌంటు ప్రారంభించామని, కొంతమంది బాబా ప్రేమికులు విరాళాలు ఇప్పటికే ఇచ్చారని కార్యదర్శి శ్రీ వై.యస్.రావు అన్నారు. ఆసక్తిగలవారు, ఆర్థిక స్థోమతగల బాబా ప్రేమికులందరూ జలనిధి కోసం తగిన విరాళాలు తప్పక అందించాలని ఆయన కోరారు.

## భావూజీ ఆరోగ్యం

ట్రస్టు చైర్మన్ భావూజీ ఆరోగ్యం గత కొద్ది రోజులుగా బాగాలేదు. మందులు తీసుకుంటున్నారు. వైద్యులు ఆరోగ్యపరీక్షలు చేస్తున్నారు. ఇది బాబా ప్రేమికులు చాలామందికి తెలుసు. ఐతే, మెహెరాబాద్‌లో జూలై 10 ఉదయం 6 గంటలకే ఒక వార్త దావానంలా పాకింది. అదేమంటే భావూజీ తెల్లవారుఝామున 5 గంటలకు బాబాలో ఐక్యమయ్యారన్నారు. మెహెరాబాద్‌లో బాబా ప్రేమికులందరూ మౌనంలోనే సంజ్ఞలతో ఇది తెలుసా? మీరు విన్నారా? అంటూ ఎవరికి వారు **'భావూ ఇక లేరని'** తమకు తెలిసినవారందరికీ చిన్న కాగితంపై రాసుకుని తెలియజేశారు. ఆ పిదప 'నగర్'కు ఎప్పుడు వెళ్ళాలి? మనం వెళ్ళొచ్చా? మనల్ని రానిస్తారా?బాబా సమాధి దగ్గరకే ఆయన్ని తీసుకువస్తున్నారట! మెహెర్‌నాథ్ అమెరికాలో వున్నాడు. ఆతను ఆ మర్నాడు వస్తాడు. అప్పటిదాకా భావూనీ నగర్‌లోనే ఉంచుతారట అన్నారు. ఐతే, అదే రోజు సుమారు 11 గంటలకు ఆ వార్త నిజం కాదని తెలిసింది. శ్రీ మల్లాది రామారావు భావూని నగర్‌లో కల్సి 'మీరు విన్నది ఒట్టి పుకారు మాత్రమేనని చెబుతూ వివరంగా మాకు మొబైల్‌లో యస్‌యంయస్ పంపారు. భావూ స్నానం చేసి బ్రేక్‌ఫాస్ట్ ముగించి, కాస్తంత నీరసంగా తనతో మాట్లాడారని శ్రీ రామారావు తెలిపారు. అప్పటిదాకా మండలి సభ్యుడు, పవిత్రమైన మౌనం రోజున భావూ బాబాలో లీనమవడం అంటే సామాన్యమైన విషయమా? అన్నవాళ్ళందరూ అవాక్కయ్యారు. ఈ దుర్వార్త ఫేస్‌బుక్‌లో యావత్తు ప్రపంచాన్ని తాకింది. జూలై 10న తెలతెలవారుతుండగానే ప్రముఖులైన ఇద్దరు తెలుగు పెద్దలు ఈ మరణవార్త అందరికీ అందేలా పుణ్యం కట్టుకున్నారని ఆ దరిమిలా గుసగుసలాడుకున్నారు. జైబాబా!!

## మెహెర్‌బాబా ప్రవచనములు

# అవతారుడు - సంస్కారములు

**(యం.శారద, సికింద్రాబాద్)**

మానవాళి జీవిక అంతా గతజన్మ సంస్కారాల మీదనే ఆధారపడి ఉంటుందని మెహెర్‌బాబా తన ప్రవచనాలలో పలుమార్లు చాలా స్పష్టంగా చెప్పారు. సంస్కారములు అనే అంశంపై అవతార్ మెహెర్‌బాబా ఈ అవతారకాలంలో వివరించినట్లు గత అవతారాలలో ఎన్నడూ తెలియజేయలేదన్నది సుస్పష్టం. కాగా, అవతారుడు, సద్గురువుల విషయంలో సంస్కారముల పాత్ర గురించి మెహెర్‌బాబా ఇచ్చిన ప్రవచనములు ఈ శీర్షికలో పరిశీలిద్దాం! ప్రధానంగా సంస్కారములు మూడు రకాలని మెహెర్‌బాబా వివరించారు.

**1. ప్రారబ్ద సంస్కారములు 2. యోగా యోగ సంస్కారములు, 3. విజ్ఞానీ సంస్కారములు. మరింత వివరంగా తెలుసుకోవాలంటే.. ..,**

## 1. ప్రారబ్ద సంస్కారములు

మనం ద్వంద్వ ప్రపంచంలో వున్నాం. మనం చేసే ప్రతి పనికీ ద్వంద్వం ఉంటుంది. మంచి - చెడు, సుఖం-దు:ఖం ఇలా పలురకాలుగా గల ఈ ద్వంద ప్రపంచంలో ప్రతి చిన్న పని కూడా ద్వంద్వ సంస్కారముల ప్రభావం వల్లనే జరుగుతుందని మెహెర్‌బాబా వివరించారు.

**ఈ ద్వంద సంస్కారములనే ప్రారబ్ద సంస్కారములని అన్నారు.**

మానవ జీవితం ప్రారంభం నుండి చరమాంకం వరకూ, అంటే భగవదైక్యం సాధించేవరకూ ఈ ప్రారబ్ద సంస్కారములే ప్రతివాని విధి విధానాల్ని నిర్దేశిస్తాయని మెహెర్‌బాబా స్పష్టం చేశారు. ఆత్మ భగవదైక్యం చెందినప్పుడు మాత్రమే ఈ సంస్కారాలు సంపూర్ణంగా అదృశ్యమౌతాయి.

**భగవదైక్యం చెందిన ఆత్మ తిరిగి ఎప్పటికీ ఈ భూమ్మీద జన్మించదని మెహెర్‌బాబా పేర్కొన్నారు.**

ఐతే అవతారునికి, సద్గురువులకు మాత్రం ఇది వర్తించదు అని మెహెర్‌బాబా ప్రకటించారు.

## 2. యోగా యోగ సంస్కారాలు

ద్వంద ప్రపంచంలో జన్మించిన అవతారుడు, సద్గురువులు యోగా యోగ సంస్కారములు కలిగి ఉంటారు. ఈ మాయా ప్రపంచంలో వీరు నిర్వహించే కార్యక్రమాలకు ఈ సంస్కారాల

ప్రభావం ఏ మాత్రం ఉండదు. వీరు తమ విశ్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడానికి యోగ యోగ సంస్కారాలు దోహదపడతాయి. అయితే అవతారుడు కానీ, సద్గురువు నిర్వహించే విశ్వ కార్యక్రమం ఏమిటి? ఈ ప్రశ్న మనలో చాలా మందికి కల్గుతుంది. ప్రతి ఒక్కరిలో ఉన్న **'నేను'** అనే అహాన్ని తొలగించి, వారిలో ఉన్న దివ్యత్వాన్ని వారికి తెలియజేయడమే వారి విశ్వకార్యక్రమంలోని అంతరార్థం. ఇది ఈ సృష్టి యొక్క పరమార్థం. స్థూలంగా చెప్పుకోవాలంటే, దైవీ మానవునిగా అవతరించిన అవతారుడు,మానవ దైవంగా పేర్కొనే సద్గురువులు అందరూ యోగాయోగ సంస్కారముల సహాయంతో ఈ మాయామయ ద్వంద ప్రపంచంలో తమ విధులు నిర్వర్తిస్తారు.

## 3. విజ్ఞానీ సంస్కారాలు

దైవీ మానవునిగా ఈ ధరణిపైకి అవతారుడు వచ్చే ముందు తనకూ, తన శిష్యవర్గానికి **'విజ్ఞానీ సంస్కారా'**లను ఇస్తాడు. అవతారుని శిష్యవలయంలో ఎప్పుడూ 122 మంది శిష్యులు ఉంటారు. వీరందరూ అవతారునితోపాటు జన్మిస్తారు. వీరు జన్మించటానికి ముందే విజ్ఞానీ సంస్కారాలను తీసుకోవటం, అవతారునికీ, ఆయన శిష్య వర్గానికీ ఒక ముసుగును ధరించటం లాంటిది. అవతారుడు మానవరూపంలో జన్మించాక ఒక నిర్ణీత సమయం వరకూ ఈ విజ్ఞానీ సంస్కారాల ముసుగులోనే కొనసాగుతాడు. సరైన సమయంలో ఆయన తన సహజ దివ్యత్వాన్ని అనుభవించినప్పుడు, విజ్ఞానీ సంస్కారాలు యోగాయోగ సంస్కారాలుగా మారి, తద్వారా అవతారుడు తన విశ్వ కార్యక్రమాన్ని కొనసాగిస్తాడు. అవతారుని శిష్యులు మాత్రం విజ్ఞానీ సంస్కారాలతో తమ కార్యకలాపాలు నిర్వహిస్తారు. విజ్ఞానీ సంస్కారాలు సాధారణ ద్వంద్వ సంస్కారాలలాంటివే. ఐనా వాటి స్వభావము మాత్రం విలక్షణం. మామూలు సంస్కారాల వలన ఎలాగైతే కార్యకలాపాలు, అనుభవాల ప్రేరణ జరుగుతుందో విజ్ఞానీ సంస్కారాల వలన కూడా అటువంటి ప్రేరణ కలుగుతుంది. అయితే సాధారణ సంస్కారాల వలన మనుషులు మరింతగా మాయా ప్రపంచంలోకి కూరుకుపోతారు. అదే విజ్ఞానీ సంస్కారాలు భ్రాంతిమయ ప్రపంచపు పట్టు నుండి బయటపడటానికి ఉపయోగపడుతుంది.దేవుడు ఒక్కడే అనే విషయాన్ని విజ్ఞానీ సంస్కారాలు తెలియజేస్తాయి. ఇదే విజ్ఞానీ సంస్కారాల ప్రధాన లక్ష్యం. భగవదైక్యానికి విజ్ఞానీ సంస్కారాలు ప్రధాన ద్వారాలవంటివి. అవతారుని శిష్యులందరూ భగవదైక్యం పొందే సమయం వచ్చేవరకూ విజ్ఞానీ సంస్కారాల ముసుగులోనే ఉంటారు. విజ్ఞానీ సంస్కారాలు కేవలం ఆయా వ్యక్తులకు భగవదైక్య సాధనకు సాయపడితే, యోగా యోగ సంస్కారాలు ఇతరులకు భగవదనుభూతి కలిగించటానికి సాయపడతాయి. అవతారుడు, సద్గురువు తమ శిష్యుల ద్వారా యావత్తు మానవాళి ఆధ్యాత్మిక ఉన్నతికి తోడ్పడతారు. అవతారుడు, సద్గురువులు పరమాత్మ స్థితిలో యావత్తు విశ్వానికి కేంద్ర బిందువుగా ఉంటారు. అనేక జన్మల పుణ్యఫలంగా అవతారునికి, సద్గురువులకు సన్నిహితంగా ఉండేలా కొందరు వారి శిష్యకూటమిలో ఉంటారు.

**అవతారుడు - శిష్యకూటమి** గురించి మరిన్ని వివరాలు ప్రక్క పేజీల్లో సందర్శించండి!!

## మెహెర్‌బాబా ప్రవచనములు

# అవతారుడు -శిష్యకూటమి

**(శ్రీమతి యస్.యస్.లక్ష్మి, కాకినాడ, అమెరికా నుండి)**




భగవంతుడు భూమిపై అవతరించినప్పుడు సద్గురువులు ఐదుగురు అతనిపై వున్న ముసుగును తొలగించి అతడు అవతారపురుషుడని లోకానికి వెల్లడిస్తారు. దైవీ మానవుడు తాను అవతారపురుషుడనని ఎరుక కలిగి అనంత జ్ఞానము, అనంత శక్తి, అనంత ఆనందములను అనుభవిస్తాడు. అదే సమయంలో మానవునిగా ఎరుక కలిగి సాధారణ మానవునివలె బాధలను కూడా అనుభవిస్తాడు.

భగవంతుడు భూమిపై జన్మించి తన కార్యక్రమం ప్రారంభించక ముందే ఆయన తనతోపాటు తీసుకువచ్చిన ఆత్మలు కూడా ఇక్కడ జన్మించి ఆయన శిష్యవర్గంగా ఏర్పడతారు. ఆయా కాలాలలోని పంచసద్గురువులు అవతారుని ముసుగు తొలగించి లోకానికి భగవంతుడని వెల్లడిస్తారు. ఆ సమయంలోనే ఆ అవతారపురుషుని చుట్టూ 12 మంది పురుషులు, ఇద్దరు స్త్రీలు చేరి ఆంతరంగిక శిష్యవర్గంగా ఏర్పడతారు. ఇదే పద్ధతి అన్ని అవతార కాలాలలోను జరుగుతుంది.

ఈ ఆంతరంగిక శిష్యవర్గం అవతారుని ఆదేశాలననుసరించి పనిచేస్తారు. మానవుడు నిద్ర లేవగానే తన శరీర అవయవాలన్నీ తన ఆదేశం మేరకు పనిచేస్తాయని ఎలా తెలుసుకుంటాడో అలాగే అవతార పురుషుడు తాను భగవంతుడనని ఎరుక కలిగిన వెంటనే తన ఆంతరంగిక శిష్యులు కూడా తన ఆదేశాన్ని అనుసరించి పని చెయ్యడానికి సిద్ధంగా ఉన్నారని తెలుసుకుంటాడు.

ఈ అంతరంగిక శిష్యవర్గమే కాకుండా అవతారుని చుట్టూ చేరినవారందరూ ఆయన పరివారమై మిగిలిన 9 వృత్తాలలో ఆయా స్థానాలను ఆక్రమించి ఉంటారు. అలా అవతారుని చుట్టూ పరివేష్టితులైన వారందరూ మొత్తం 10 వలయాలలో ఒక్కొక్క వలయంలో 12 మంది చొప్పున మొత్తం 120 మంది ఉంటారు. 10వ వృత్తంలో 12 మంది పురుషులతోపాటు ఇద్దరు స్త్రీలు కూడా అవతారుని కార్యంలో పాలుపంచుకుంటారు. అలా అవతారపురుషుని చుట్టూ పరివేష్టితులైన శిష్యవర్గం సంఖ్య మొత్తం 120+2=122 మంది ఉంటారు.

అవతారునికి అత్యంత సమీపంలో అనగా అంతరంగిక కార్యవర్గంగా ఏర్పడినవారు 12 మంది పురుషులు, ఇద్దరు స్త్రీలు ఇది మొదటి వృత్తం. ముందున్న వృత్తంలో ఉన్నవారితో గల సంబంధాన్ని అనుసరించి తరువాత వృత్తంలోని సభ్యులు ఏర్పడతారు. అలా అవతారుని చుట్టూ పది వృత్తాలలోను మొత్తం 122 మంది శిష్యవర్గం ఆయన ఆదేశాన్ని అనుసరించి పనిచేస్తూ ఉంటారు.

**మొదటి సర్కిల్ - 12 పురుషులు - 2 స్త్రీలు**
**రెండవ సర్కిల్ - 8 పురుషులు - 4 స్త్రీలు**
**మూడవ సర్కిల్ - 4 పురుషులు - 8 స్త్రీలు**
**నాల్గవ సర్కిల్ - 8 పురుషులు - 4 స్త్రీలు**
**ఐదవ సర్కిల్ - 4 పురుషులు - 8 స్త్రీలు**
**ఆరవ సర్కిల్ - 8 పురుషులు - 4 స్త్రీలు**
**ఏడవ సర్కిల్ - 6 పురుషులు - 6 స్త్రీలు**
**ఎనిమిదవ సర్కిల్ - 8 పురుషులు - 4 స్త్రీలు**
**తొమ్మిదవ సర్కిల్ - 8 పురుషులు - 4 స్త్రీలు**
**పదవ సర్కిల్ - 10 పురుషులు - 2 స్త్రీలు**

## ఆంతరంగిక కార్యవర్గం

వీరంతా గత అవతార కాలంలో పనిచేసిన వారిని అన్ని విధాలా పోలి ఉంటారు. అదే స్వభావం కలిగి ఉంటారు. ఉదాహరణకు జీసస్ క్రీస్తు ఆంతరంగిక కార్యకర్తగా పీటర్ ఒక కార్యక్రమాన్ని నిర్వహించేవాడు. జీసస్ తరువాత అవతారంలో కూడా మరొకనికి పీటర్

లక్షణాలు పోలి ఆతని మనసు, హృదయం ఉంటాయి. అదేమాదిరిగా క్రీస్తు ఇతర శిష్యులైన జూడాస్, జేమ్స్ తదితరులు నిర్వహించిన కార్యక్రమాలనే ఆ తరువాత అవతారంలోని శిష్యవర్గం చేబడతారు.

అవతారుని కృపతో ఆంతరంగిక కార్యవర్గంలోని వారందరూ అదే అవతార కాలంలో భగవదనుభవాన్ని పొందుతారు. అవతారుని వ్యక్తీకరణ జరిగిన వంద సంవత్సరాల కాలంలో వారంతా ముక్తిని పొందుతారు. అలాగే బయట వృత్తాలలో ఉన్నవారు కూడా అవతారుని కృపతో భగవదనుభవాన్ని పొందగలరు. కానీ ఆ అవతార కాలంలోనే ముక్తిని పొందుతారని కాదు. వారు ఏ కార్యాలయాన్ని నిర్వహించరు. వారిలో ఒకరు లేక కొంతమంది అవతారుడు జీవించి ఉన్న కాలంలో కాని, లేక తరువాత కాని లేక తరువాత 1, 2 జన్మలలో కాని ముక్తి ప్రాప్తిస్తుంది.

అవతారపురుషుని ఆంతరంగిక కార్యవర్గం అనగా ఇన్నర్ సర్కిల్‌ని ఒక మానవుని శరీర భాగాలతో పోల్చవచ్చు. రెండు చేతులు, రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు ముక్కు రంధ్రాలు, ఒక నోరు, రెండు చేతులు, రెండు కాళ్ళు, ఒక మొండెం, జననేంద్రియం, విసర్జకావయవం అన్ని కలిపి 14. మనిషి భూమిపై జన్మించగానే అన్ని అవయవాలు పనిచేయనారంభిస్తాయి. విడివిడిగాను కలిసి కూడా పనిచేస్తాయి.

అలాగే అవతారుడు భూమిపై జన్మించగానే అతని అంతరంగిక కార్యవర్గం నేరుగా పని ప్రారంభిస్తుంది. అవతారపురుషుని అనుసరించి 14 మంది విడివిడిగాను సంఘీభావంతోను పనిచేస్తారు. వారంతా వేరువేరు వ్యక్తిత్వాలు కలిగి ఎల్లప్పుడు వారివారి కార్యాలయాలలో పనిచేస్తారు. అవతారుడు జీవించి ఉన్నప్పుడు లేనప్పుడు కూడా విడివిడిగాను అందరూ కలిసి గత అవతార కాలంలో పనిచేసినట్లే కార్యనిర్వహణ చేస్తారు.

వీరందరూ అవతార కాలంలోనే ముక్తిని పొందుతారు కనుక తరువాత మళ్ళీ భగవంతుడు భూమిపై అవతరించినప్పుడు మరొక తన కార్యవర్గాన్ని అతడు భూమికి తీసుకువస్తాడు. బాబా అప్పుడప్పుడు తన ఆంతరంగిక శిష్యవర్గంగా కొంత మందిని సూచించడం జరిగింది. గుస్తాద్‌జీ తన వర్గంలోని వానిగా పేర్కొన్నారు. అతనికి భగవదనుభవం కలుగుతుందని తరువాత మరణిస్తాడని సూచించారు. అలాగే తాను జీసస్‌గా వచ్చినపుడు ఇద్దరు వ్యక్తులు నిర్వహించిన విధులను పాశ్చాత్యులైన టాడ్, హెర్బర్ట్ అనే ఇద్దరు నిర్వహిస్తున్నారని చెప్పారు. తాను కృష్ణునిగా వచ్చినప్పుడు వారిద్దరు నారదుడు, సుధాముడుగా జన్మించారని వెల్లడించారు. వివిధ అవతార కాలాలలో కొందరు అదే వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటారని కొందరు అదే రూపాన్ని కూడా కలిగి ఉంటారని చెప్పారు. కాని పేర్లు మాత్రం వేరుగా ఉంటాయి. కాకాబారియా, చాంజీలు కూడా బాబా సర్కిల్స్‌లోని వారిగా పేర్కొన్నారు.

బాబా పాశ్చాత్య పర్యటనలో వుండగా వెనిస్ నగరంలోని సెయింట్ మార్క్స్ స్క్వేర్ అనే చర్చిని దర్శించారు. తనతోపాటు ఉన్న శాంటా మార్గరీటాకు, కిట్టిదేవికి ఆ చర్చి యొక్క

విశిష్టతను తెలియచేసారు. కళాత్మకమైన ఆధ్యాత్మికతను ప్రతిబింబించే ఆ చర్చి విశేషాలను తెలియబరచారు. అందులో ఉన్న స్థంబాలను, గోపురాలను, ద్వారాలను లెక్కించమన్నారు. అవన్నీ కలిపితే సరిగ్గా 120 సంఖ్య వచ్చింది. ఆ చర్చి యూరోప్‌లోని ప్రముఖమైన ఆధ్యాత్మిక కేంద్రాలలో ఒకటిగా అభివర్ణించారు. ఆ చర్చి నిర్మాణమంతా అవతార పురుషుని ఆంతరంగిక సర్కిల్‌లోని 12 మంది సభ్యులకు మిగిలిన 9 వృత్తాలలోని 108 మంది సభ్యులకు ప్రతినిధిగా నిలిచిందని వివరించారు. అంతేగాక బాబా రానోగేలీ అనే పాశ్చాత్య వనితచే రేఖా చిత్రాన్ని గీయించారు. బాబా తన ఇన్నర్ సర్కిల్ గురించి ఇంకా ఇలా వివరించారు.

అవతారుడు కాని, సద్గురువు కాని తమ ఆంతరంగిక వర్గంలోని సభ్యులంతా ప్రభువుకు పుత్రసమానులన్నారు. వారంతా తన కుటుంబమని, తన దివ్యసంపదకు వారు వారసులని వివరించారు.

బాబా ఇంకా "నా సర్కిల్‌లోని వారికి ప్రత్యేకమైన విధులు, ఆంక్షలు ఉంటాయి. వారు ఎంత తీవ్రమైన తప్పుచేసినా క్షమిస్తాను. ఐతే, సాధారణ జనులకు విధింపబడే శిక్షలు వీరికి వర్తించవు" అన్నారు. ఇలా గత అవతారాలలో వివరించని ఎన్నో ఆధ్యాత్మిక విషయాలు మెహెర్‌బాబా తన ప్రవచనాలలలో వివరించారు.

ముఖ్యంగా తన శిష్య బృందం గురించి అందులో ముఖ్యంగా ఆంతరంగిక శిష్యుల గురించి (ఇన్నర్ సర్కిల్) వారి విధులు, బాధ్యతల గురించి వివరించారు. ఐతే ఈ అవతార కాలంలో, తన మండలి సభ్యులుగా వున్న 122 మంది శిష్యులు ఆ పది వృత్తాలలో ఎవరెవరు ఏఏ వృత్తంలో ఉన్నారో స్పష్టంగా బాబా చెప్పలేదు.

# క్రొత్త వెబ్ పేజి

అవతార్ మెహెర్‌బాబాకు సంబంధించిన సమస్త సమాచారంతో ఒక క్రొత్త వెబ్ పేజిని పాశ్చాత్య బాబా ప్రేమికుడు Patrick Finley రూపొందించాడు.

ఆ వెబ్‌సైట్‌ను https://sites.google.com / site/meherabadmoments ను త్వరలో మీరూ తప్పక సందర్శించండి!!

# వివాహం

శ్రీ సి.వై. చింతామణి గారి మనుమరాలు చి॥ల॥సౌ॥ మెహెర్ దివ్య వివాహము చి॥ వెంకట కృష్ణ ప్రసాద్‌తో 24.08.2013 రాత్రి గం. 2.42 ని.లకు సంపత్ వైభాగ్య ఫంక్షన్ హాల్, యం.వి.పి. డబుల్ రోడ్, సెక్టర్ – 3, గిరిజన్ భవన్ ఎదురుగా, విశాఖపట్నం నందు జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

# మీరెంతో అదృష్టవంతులు

అవతారుని మండలి సభ్యులు కావాలంటే ఎన్నో జన్మల పుణ్యఫలం వుండాలి.

ఈ మాటలు అవతార్ మెహెర్‌బాబా తన మండలి సభ్యులతో ఎన్నోమార్లు చెప్పారు. తన మండలివారితో మీరెంతో అదృష్టవంతులనేవారాయన. నాతో మీ సహజీవనం ఎన్నో జన్మల అనుబంధం అనేవారు. హిమాలయాల్లో తపస్సు చేసుకునే యోగులకు కూడా దక్కని అదృష్టం మీకు లభించిందని బాబా తన శిష్యుల్ని ప్రశంశించేవారు.

మాకయితే అంతటి అదృష్టం ఏమీ కనిపించడం లేదని మండలివారు మాత్రం పెదవి విరిచేవారు. ఆ అదృష్టపు ఛాయలుకూడా మా దరిదాపుల్లో కూడా లేదని గుసగుసలాడుకునేవారు. చిన్నపాటి పొరపాటుకు ఆ రోజంతా బాబాతో చీవాట్లు తప్పించి, మండలి సభ్యులుగా అదృష్టం లేశ మాత్రం లేదని వాపోయేవారు. ఐతే ఒకసారి ఎప్పటిలాగానే మండలి అదృష్టం అంతాఇంతానా అని బాబా గొప్పగా చెబుతుంటే ఏరుచ్ తన మనస్సులోని మాటల్ని బాబా ఎదుట నిర్మొహమాటంగా చెప్పేశాడు. నీవు వర్ణించేటంత అదృష్టం మాకేం ఉంది బాబా అని బాబాతో నేరుగానే అనేశాడు. ఆ సమయంలో బహుశా ఈ మాటలు బాబానే నాతో అనిపించారేమో? ఏమో!! అని ఏరుచ్ నాలిక కరుచుకున్నాడు.

ఈ మాటలు విని బాబా స్వయంగా ఏరుచ్‌కి ఓ కథ చెప్పారు. బాబా చెప్పిన ఈ కథను ఏరుచ్ తరచు మండలిహాలులో చెప్పేవారు. ఇకపై ఏరుచ్ మాటల్లోనే ఆ మాటలు విందాం!!

శ్రీ కృష్ణావతారంలో 'నారదుడు' తెలుసు కదా అని బాబా అన్నారు. శ్రీకృష్ణుని మండలి సభ్యుడు 'నారదుడు'. కృష్ణుడు తనతో వుంటున్న సహచరులు ఎంతో అదృష్టవంతులు అని పలుమార్లు తన మండలివారిని ఉద్దేశించి అంటుంటే, ఓసారి 'నారదుడు' చికాకు పడుతూ నీవు చెబుతుంటే వినడమే కానీ మాకెలాంటి అదృష్టపు అనుభూతీ లేదని కృష్ణుడితో కొంత చికాకుగానే అన్నాడు.

కృష్ణుడు అవాక్కయి – ఐతే నీకు ఆ అనుభవం త్వరలోనే కలిగిస్తానని హామీ ఇచ్చాడు. కొద్దిరోజులు గడిచాక ఊరికి దూరాన గల నది ఒడ్డుకు నారదుడిని వెళ్ళమని శ్రీకృష్ణుడు ఆదేశించాడు.

నారదుడు అలా వెళ్ళి తేరిపారా చుట్టూతా పరికిస్తే ఏముంది? ఏమీ లేదు. ఇంతలో మానవ మాలిన్యం నుండి బయటకు వస్తున్న ఒక పేడ పురుగు నారదుడిని చూసి, అక్కడికక్కడే చనిపోయింది. ఇదా నాకు యిప్పించే అనుభవమని తిరిగి వెళ్ళి జరిగినదంతా కృష్ణుడికి చెప్పాడు.

కృష్ణుడు అంతా ఆలకించి, త్వరలో మరో మంచి అనుభవం నీకు లభిస్తుంది. నీ గొప్పతనం ఏమో నీకు తెలుస్తుందని అన్నాడు.

ఇది జరిగిన కొన్ని రోజులకు నారదుడిని ఫలానా చోటుకు వెళ్ళి అక్కడున్న పెద్ద చెట్టు నీడన నిలబడమని కృష్ణుడు ఆదేశించాడు. అలా వెళ్ళిన నారదుడికి ఆ చెట్టుపైన వున్న రామచిలుక నారదుడిని చూసి, రెక్కలు టపటపా కొట్టుకుంటూ నేలపై పడి ప్రాణాలొదిలేసింది. తనను చూస్తూనే ప్రాణాలొదిలిన పక్షి గురించి నారదుడు కృష్ణుడితో వివరంగా చెప్పి అదయ్యా – మా గొప్పతనం అని ఎకసెక్కంగా నవ్వుతూ అన్నాడు.

లేదు! – లేదు!! త్వరలో నీ గొప్పతనం ఏమిటో నీకు అనుభవంలోకి వస్తుంది. అందాకా వేచివుండమని శ్రీకృష్ణుడు నచ్చచెప్పి, కొద్దిరోజులకు ఒక రాజు గారి కుమారుని పుట్టినరోజు వేడుకలకు తన తరఫున హాజరు కావాలని శ్రీకృష్ణుడు నారదుడిని ఆదేశించాడు. నారదుడు రాజాస్థానానికి వెళ్ళడానికి ఇష్టపడలేదు. చాలాసేపు తటపటాయించాడు. ఎందుకంటే, ఆ పక్షి – పేద పురుగుల మాదిరి పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న యువరాజుకి ఏమయినా అయితే, ఎలాంటి శిక్ష అనుభవించాలో కదా అని భయపడుతూ రాజు గారి కొలువుకు వెళ్ళడానికి జంకుతాడు. ఐనప్పటికీ శ్రీకృష్ణుని ఆదేశాలు జవదాటలేక రాజు గారి రాజప్రాసాదానికి వెళతాడు. ఎన్నో విధాల రాచమర్యాదలు పొందుతాడు. యువరాజును ఆశీర్వదించడానికి మాత్రం వెనుకంజ వేస్తుంటే, రాజు గారే ఇది గమనించి నారదుడిని దగ్గరుండి ఊయల్లో వున్న రాకుమారుడి దగ్గరకు తీసుకెళతాడు. నారదుడు ఆ పిల్లవాడికేసి చూడకుండానే ఆశీర్వదించి తలదించుకుని ముందుకు సాగిపోతుంటే, ఊయల్లోని రాకుమారుడే నారదుడ్ని – స్వామీ అని ప్రేమతో పిలుస్తూ " నాకేసి కన్నెత్తైనా చూడకుండా, నన్ను ఆశీర్వదించకుండా అలా వెళ్ళిపోతున్నారు. ఇది తగునా? అని అడుగుతాడు. పేద పురుగులా వున్న నాకు, మీ దర్శన భాగ్యంతోనే పక్షి జీవితం ప్రసాదించారు. పక్షిగా వున్న నాపై మీ నజర్ పడగానే రాకుమారుడిగా ఇక్కడ జన్మించాను. ఇప్పుడు మీరు నాకేసి క్షణకాలం చూస్తే మీ చూపుతో నాకు భగవదైక్యం లభించును కదా!! అని నాకేసి చూడవయ్యా నారద మహర్షీ అని ఆ బాలుడు వేడుకున్నాడు. తాను వింటున్న ఆ మాటలు నారదుడు నమ్మలేకపోయాడు. శ్రీకృష్ణుడితో ఆ మాటలే అన్నప్పుడు ఇప్పుడు నమ్ముతావా? నా సన్నిహితులెంత అదృష్టవంతులో? ఎంతటి శక్తిమంతులో అని చతురంగా క్రీగంట చూశాడు కృష్ణ భగవానుడు.

ఏరుచ్ తరచు ఈ కథనాన్ని మండలి హాలులో మరింత రసవత్తరంగా వినిపించేవారు. బాబా ప్రేమికులు చాలామంది ఈ కథనాన్ని ఈపాటికే వినివుండవచ్చు. ఐనప్పటికీ కొత్తవారి కోసం, అవతారుడు – మండలి అంశంపై ప్రత్యేక శీర్షిక ప్రచురిస్తున్న సందర్భంగా 'అవతారుని మండలి' కావడం ఎంతటి అదృష్టవంతులో తెలియజేసే ఈ అంశాన్ని చర్విత చరణంగా ప్రచురించడమైంది!!

– ఎడిటర్

ఉపాసినీ మహారాజ్ తన ప్రేమికులకిచ్చిన సందేశం

# బాధలెందుకు?

– శ్రీమతి కె. గౌరి, హైదరాబాద్



ప్రభూ! మీకు చాలా దగ్గరగా ఉండే ప్రేమికులు చాలా తీవ్రమైన వేదన, ఆవేదనలు అనుభవిస్తారు కదా? అలా ఎందుకు అని ఒకసారి ఉపాసనీ మహారాజ్ ఆశ్రమంలో ఉంటున్న భక్తుడొకరు మహారాజ్‌ని అడిగాడు.

దానికి సమాధానంగా మహారాజ్, తక్కువ చైతన్యంలో వున్న ఒక జీవి,
ఎక్కువ చైతన్యం ఉన్న జీవిలో ఐక్యం కావాలనుకుంటే,
ఆ తక్కువ చైతన్యపు స్థాయిలో ఉన్న జీవి ఎక్కువ చైతన్యమున్న జీవికి
ఆహారంగా మారిపోవాలి అన్నారు.
ఎక్కువ చైతన్యం ఉన్న జీవి తక్కువ చైతన్యం ఉన్న జీవిని పూర్తిగా తినేసినప్పుడు
తక్కువ చైతన్యం ఉన్న జీవి ఎక్కువ చైతన్యమున్న జీవితో కలిసిపోయి ఒకటైపోతుంది.
ఒక కీటకం ఒక పక్షి స్థాయికి ఎదగాలంటే,
అది పక్షికి ఆహారంగా మారాలి.
ఒక మేక పిల్ల సింహం స్థాయికి చేరాలంటే ఆ మేక సింహానికి ఆహారంగా మారాలి.

ఆ సింహం ఆ మేకను జీర్ణించుకోడానికి దాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని విందు ఆరగిస్తుంది.

అదే విధంగా నేనూ నా ప్రేమికులతో వ్యవహరిస్తాను.

నా ప్రేమికుడు తనకంటే ఎక్కువ చైతన్యంలో ఉన్న నన్ను నిజంగా చేరాలనుకుంటే అతడు నాకు ఆహారంగా మారాలి.

ఆ ఆహారాన్ని నేను జీర్ణించుకోవాలంటే దాన్ని చిన్న చిన్న తునకలుగా చేసుకోవాలి. అప్పుడు సరిగ్గా జీర్ణమై నాలో కలిసిపోతుంది.

అప్పుడే కదా నాకు ఆహారమైన నా ప్రేమికుడు నా యొక్క ఉన్నతచైతన్యంతో ఏకమౌతాడన్నారు మహారాజ్!

కాబట్టి, నా ప్రేమికుడు బాధపడడం అంటే వారి అహం ముక్కలు ముక్కలు కావల్సివస్తుందని మహారాజ్ అన్నారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు...

నీవెప్పుడైనా బంగారం అమ్మడానికి కంసాలి దగ్గరకు వెళ్ళావా? అని ప్రశ్నించారు.

కంసాలి వద్ద పెద్దమొత్తంలో బంగారం ఉంటుంది.

నీవు అతని వద్దకు నీ బంగారం పట్టుకెళ్ళినప్పుడు అతడు దాన్ని వెంటనే కరిగించేసి తన వద్దనున్న బంగారంలో కలిపేసుకోడు. ఆ బంగారం ఎంత నికార్సయిందో మొదట పరీక్షిస్తాడు. దాన్ని గీటుగాయిపై గీచి చూస్తాడు.

అవసరమైతే సుత్తితో కొడతాడు.

ఇంకా అవసరమైతే రకరకాల పరీక్షలు చేస్తాడు. అన్ని పరీక్షలు పూర్తయ్యాక ఆ బంగారం మంచిదే అని తాను నమ్మినప్పుడు మాత్రమే తీవ్రమైన వేడిపై దాన్ని కరిగిస్తాడు. ఆ పిదప దాన్ని తన దగ్గర ఉన్న బంగారంతో కలుపుకుంటాడు.

నా దగ్గరున్న స్వర్ణనిధిలో ఎవరైనా చేరాలనుకుంటే వాని నాణ్యతను పరీక్షించడానికి అనేక పరీక్షలు చేస్తాను.

ఆ తరువాతనే వానిని నా దగ్గరున్న నిధిలో కలుపుకుంటాను.

మరో ప్రేమికుడు మహారాజ్‌ను,

ప్రభూ! మీ శిష్యులెందుకు బాధపడతారో వివరంగా చెప్పారు.

బాగుంది.

మరి కొన్ని సందర్భాలలో **గురువు** కూడా బాధపడుతుండటం చూస్తాం.

దానికి కారణమేమిటోనని వినమ్రంగా ఆతను అడిగాడు.

దానికి సమాధానంగా మహారాజ్ ఇలా వివరించారు.

గురువు తన ప్రేమికులను బాధలకు గురిచేసి వారి సంస్కారాలను తీసుకోవడమే కాదు, తానూ స్వయంగా అనేక బాధలనుభవిస్తూ తన ప్రేమికులలో తన పట్ల

దయ, జాలి, కరుణ, త్యాగం, భక్తి శ్రద్ధలు పెంపొందేలా చేస్తాడు.
గురువు గారి దయవల్ల కలిగే బాధలు భరించలేనివారు గురువును అన్యాపదేశంగా దూషించడానికి కూడా వెనుకాడక పోవచ్చు.
ఐతే అదే శిష్యులు, గురువు బాధలనుభవిస్తుంటే చూసి చలించిపోతారు.
అలాంటివారికి తమ గురువు ఎడల ద్వేష భావం, లేదా కోపం లాంటిది ఏమైనా వుంటే అది కరిగిపోయి, దాని స్థానంలో ప్రేమ, దయ పెంపొందే అవకాశం ఎంతో వుంది.
ఈ మార్పు వారు సేవాభావంతో జీవించడానికి తోడ్పడుతుంది.
గురువు సంతోషం కోసం తామెన్ని కష్టాలు అనుభవించడానికైనా సిద్ధమౌతారు.
ఇది నా ప్రేమికులకు చాలా అవసరం.
అందుకే నేను అనేక బాధలు సృష్టించుకుని, నా ప్రేమికులకు సహాయపడతాను.
ఈ మాదిరిగా వారి ఆధ్యాత్మిక ఉన్నతికి దోహదపడతాను.
మానవ జీవిత లక్ష్యమైన బ్రహ్మైక్య సాధనకు నా వంతు సహాయం చేస్తానని మహారాజ్ తన సందేశంలో పేర్కొన్నారు.
**ఈ సందర్భంలో మెహెర్‌బాబా సోదరి మణి ఒకసారి బాబాను అడిగిన ప్రశ్నను గుర్తుచేసుకుందాం.**
బాబా! నీవు క్రీస్తుగా వచ్చినప్పుడు పీటరు ప్రధానపాత్ర పోషించాడు కదా!
అలాంటివాడు నీ చివరి క్షణాలలో మూడుసార్లు నీవెవరో కూడా తనకు తెలియదనేశాడు.
ఆ సమయంలో తప్పించి మిగిలిన జీవితమంతా పీటరు నీ వెన్నంటే ఉన్నాడు.
**మరి అలాంటప్పుడు నిన్ను వ్యతిరేకించే పాత్రలో అతడిని ఎందుకు వుంచావని ఆమె బాబాని అడిగింది.**
**ఇందుకు బాబా జవాబిస్తూ...**
అవును పీటరు నన్ను తిరస్కరించాక అతడెంతో బాధపడ్డాడు.
ఎంతగానో పశ్చాత్తాపపడ్డాడు. తన తప్పు తెలుసుకున్నాడు.
ఐతే ఆ తదుపరి, పీటరు అనుభవించిన ఆ తీవ్ర పశ్చాత్తాపమే నా యొక్క విశ్వకార్యక్రమాన్ని గొప్పగా చేపట్టడానికి ఎంతగానో సహాయం చేసింది.
ఇది మీరు గమనించాలని బాబా అన్నారు.

***

అంతేకాదు, వరుసగా ఒక్కొక్కరికే శిలువ వేస్తుంటే, తన వంతువచ్చినప్పుడు తనను తలక్రిందులుగా వ్రేలాడదీయమని ధైర్యంగా పీటరు కోరాడని మణి పేర్కొంది.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-4 (1929 మే నుండి) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

*(గత సంచిక తరువాయి)*

అదీ నీ మంచికే అంటూ, బాబావారు రావ్ సాహెబ్‌ని కొత్త ఆశ్రమానికి మేనేజరుగా నియమించారు. పిల్లలు నిన్ను పరీక్షిస్తున్నారనుకో, వాళ్ళ పేరుచెప్పి నీకు సహనం ఎక్కువవుతోంది. అలా ఈ పిల్లలు నీకు ఎంతో మేలు చేస్తున్నారు. నీవు తెలుసుకోలేకపోతున్నావీ సంగతి అన్నారు.

పిల్లల్ని పెంచి పెద్ద చేయాలంటే ఎంతో ఓపిక కావాలి.

ప్రేమతో వాళ్ళని దగ్గరకి తీసుకొని లాలించి, బుజ్జగిస్తూ వుంటే, చెప్పినట్లు చేస్తారు. బుద్ధిమంతులవుతారు. వీళ్ళని నిర్లక్ష్యం చేస్తే, మంచి కుర్రాడు కూడా చెడిపోతాడు అని రావ్ సాహెబ్‌కి బాబావారు చెప్పారు. తల్లి షిరీన్‌మాయి ఎంత ఒత్తిడి చేసినా పెళ్ళి చేసుకోనమ్మా ఈ అవతార కాలంలో అన్న మెహెరుడికి పిల్లల్ని పెంచే మెళుకువలు ఎలా తెలిశాయా అని మండలివారు కొందరు ఆశ్చర్యపోయిన మాట మాత్రం నిజం. తండ్రులకే తండ్రి, యావత్ జగత్తుకే తండ్రి అయిన మెహెర్ భగవానునికి తెలియనివి ఏమయినా వుంటాయా ఏమన్నానా అనుకొన్నారు ఇంకొందరు.

సరే కొత్త ప్రేమాశ్రమానికి నైట్ వాచ్‌మన్‌గా ఛాన్జీని నియమించారు.

అంటే రాత్రిళ్ళన్నా కాస్తంత బాధ తగ్గుతుందన్న మాట అనుకొన్నాడు రావ్ సాహెబ్.

అలా, నలుగురు పిల్లల ప్రేమాశ్రమం ఏర్పాటు చేసిన బాబావారు జూన్ తొమ్మిదవ తేదీన నాసిక్ వెళ్ళారు. వెంట ఛాన్జీ, కైఖుస్రూ, మాసా, సూనా కదిలారు.

'మీరాక మాకెంతో సంతోషం కదండీ' అంటూ స్త్రీమండలి హడావుడి పడ్డారు. బాబావారిని పూలతో ముంచెత్తారు. మెహెరా, నాజా, ఖోర్షెద్ బాబావారి కోసం పెద్ద పూలదండ చేశారు. ముగ్గురూ బాబావారికి ఆ పూలదండ వేసి, మన దండలో బాబావారు భలే వెలిగిపోతున్నారని మురిసిపోయారు.

"నిన్ను విడిచి వుండలేమయా, మణిజ సహోదరా' అన్న కవి వాక్కుకి ప్రతిరూపాలయిన స్త్రీమండలి ధ్యాస ఎప్పుడూ ఒక్కటే. బాబావారిని అందంగా అలంకరించాలి. మరో ధ్యాస లేదు. బాబావారు దగ్గరవున్నా, దగ్గరగావున్నా వాళ్ళ ఆలోచన అంతా బాబావారి చుట్టూనే.

పూలతో, పూసలతో, గుడ్డలతో ఇలా ఏది అందుబాటులో వుంటే వాటితో ఏదో ఒక వస్తువు తయారుచేయడం బాబావారు రాగానే, ఆయన్ని దానితో అలంకరించడం, ఇదే స్త్రీమండలి అలవాటు.
ఒకసారి కిరీటం చేస్తే, ఇంకోసారి పెద్ద పొడవాటి సాద్రా కుట్టేవారు.
పూలతో రకరకాల దండలు చేసేవారు. అదొక తృప్తి. అదొక ఆనందం.
మాటలకు అందనిది ఈ భగవత్ప్రేమ.

*ప్రేమ మధువులో తడిసి ముద్దయినాయి ఇవన్నీ*
*ఎంత మేలిమిదో ఆ మధువు,*
*ఎప్పటిదో, అధిగమించిందేవాళ్ళ ప్రేమ*
*ఆ దివ్యోన్మత్తతనీ, సాటిలేవు ఆ ప్రేమకీ, ఆరాధనకీ మరేవీ.*

మాటలకందని మధురానుభూతులవి.
నాసిక్‌కి దగ్గరగా వున్న పాండు లీనాగుహలని బాబావారు ఆ సాయంత్రం చూశారు.
ఆ స్థలం నచ్చింది. పిల్లల ధ్యానానికి ఈ జాగా బాగుంటుందన్నారు.
వెంటనే రుస్తుంకి పని పెట్టారు. గుహల వాచ్‌మన్‌ని కలువు.
ధ్యానానికి అనుమతి అడుగు అన్నారు. సరేనన్నాడతడు. వాచ్‌మన్‌ని కలిశాడు.
ఇది నావల్ల అయ్యేపని కాదు బాబయ్య, పెద్దోళ్ళని కలిసి మాట్లాడండి అన్నాడు.
ఆ మాటనే రుస్తుం బాబావారి చెవిన వేశారు.
మర్నాడు రెండు ప్రాచీన మందిరాలకి వెళ్ళారు. ఆ రెండూ కొండల్లో వున్నాయి.
ఒకటి జైన్ మందిరం. రెండవది రామాలయం. జైన్ మందిరంలో కూడా ధ్యానానికి అనుమతి కష్టమే అని తేలింది. మందిరం నిర్వహణకి ట్రస్టు వుంది.
ఆ ట్రస్టువారిని అడగాలి ఏదికావాలన్నా అక్కడ.
ఇహ రామాలయం విషయానికి వస్తే, ఆ కొండ మరీ ఎత్తుగా వుంది.
మెట్లు లేవు గుడికి. కొండ అంచున నడుస్తూ వెళ్ళాలి పైకి.
తండ్రి మాట కోసం అయోధ్యని వదలి అడవుల పాలయిన రాముడు,
ఇక్కడ ఈ కొండపై కొంత కాలం వున్నాడని స్థానికులు అంటారు.
అలా పావనక్షేత్రం కావటం వల్ల ధ్యానానికి తగిన చోటు అది.
కానీ మెట్లు లేకపోవడంతో ఆ ఆలోచన విరమించుకొన్నారు.
సాయంత్రం బాబాను రుస్తుం గాగాపూర్ జలపాతానికి తీసుకువెళ్ళాడు.
ఎంతైనా కొండలపై నుండి నీళ్ళు క్రిందకు పడుతుంటే చూడటానికి ఎంతో బాగుంది.
బాబావారికి నచ్చిందా ప్రాంతం. ఆ జలపాతం కేసిచూస్తూ నిలబడ్డారు చాలాసేపు.
బాబావారు ప్రసన్నంగా కనిపించారు.

ఇదే అదును అనుకొని మనస్సులో మాట చెప్పాడు రుస్తుం.
సినిమా తీయాలనుంది బాబా మీరు ఒప్పుకుంటే అన్నాడు.
డి.జి.ఫాల్కే పెట్టుబడి పెడతానన్నాడు. దర్శకుడిగా అనుభవముంది
అతనికి సినిమా రంగంలో. భక్తి, ముక్తి గురించి సినిమాలు తీయాలని వుంది.
ఇటువంటి సినిమాలు రాలేదు ఇంతవరకు అని చెప్పాడు.
బాబావారి సందేశ వ్యాప్తికి సినిమాలు భేషైన మాధ్యమం అన్నాడు.
నా మనస్సులో మాట చెప్పాను, బాబావారు ఎలా స్పందిస్తే, అలా చేద్దామనుకొన్నాడు.
బాబావారు చిరునవ్వు నవ్వారు. నీ ఆలోచన మంచిదే అలానే చేయి అన్నారు.
బాబావారు ఏమంటారో అని భయపడ్తున్న రుస్తుంకి ఒక్కసారి గుండెల పైనుంచి బరువు దించినట్లయింది. హమ్మయ్య! నా కోరిక తీరింది! అని ఆనందంతో గాలి కొట్టిన బెలూన్‌లా తేలిపోయాడు. సృష్టికర్తకి సినిమాల ప్రచారమా అనుకొన్నవాళ్ళున్నారు. బాబా సందేశ వ్యాప్తికి ఏదో ఒక మాధ్యమం అవసరం. సినిమాలయితే తప్పేమిటి. పేపర్లలో బాబా గురించి వ్రాయటం లేదూ అనుకొన్నవారూ వున్నారు. మాధ్యమాల సృష్టికర్తకి ఏ మాధ్యమమయినా ఒక్కటే అనుకొన్నారు ఇంకొందరు.
రుస్తుం స్నేహితుడు ఫాల్కే ఎవరో తెలుసా.
భారతీయ చిత్ర పరిశ్రమ గర్వించే దాదా సాహెబ్ ఫాల్కే ఈయనే.
నాసిక్‌లో బాబావారు ఇంకో రెండురోజులున్నారు. స్త్రీమండలి ఆనందానికి అవధులు లేవు. బాబా నామస్మరణలో, బాబా ధ్యాసలో నిత్యం వుండే వారికి ఆ రెండు రోజులు ఇట్టే గడిచాయి. జూన్ 11న బాబావారు రైలు ఎక్కారు.
సాయంత్రానికి నగర్ చేరారు. స్టేషన్ నుంచి ఎకాయెకి మెహెరాబాద్‌కి వచ్చారు.
ఈసారి ఎందుకనో నగర్‌లో ఆగలేదు. నౌసేర్వాన్ సాథా ఇంటికి వెళ్ళలేదు.
మెహెరాబాద్‌లో అడుగు పెడ్తుండగానే అర్ధషేర్ నిర్వాకం బాబావారి చెవిన పడింది.
బాబావారేమో అతడిని భగవన్మార్గంలో పడేద్దామనుకొన్నారు.
గురువు ఏమనుకొన్నాడో కాదు ముఖ్యం.
గురువు అనుగ్రహంతో తరించగల సంస్కారం ముఖ్యం.
మరి అంతటి అదృష్టం మన అర్ధషేర్‌కి లేదు.
ఈ మాటే బాబావారు చెప్పారు. భగవన్మార్గం వాడి నొసట వ్రాసిలేదు.
అందుకనే వాడు నేను వచ్చేలోగా పరిష్యాకి ప్రయాణమయ్యాడన్నారు.
వెంటనే కొత్త ప్రేమాశ్రమానికి వెళ్ళారు.
అక్కడ అడుగు పెడ్తుంటే రావ్ సాహెబ్ దిగాలుగా కనిపించాడు.
ఈ ఆశ్రమానికి రావ్ సాహెబ్ మేనేజరు గారు. ఇక్కడ పిల్లలు ఎంతమందో తెలుసుగా – నలుగురు అంటే నలుగురు.

వాళ్ళేమో బాబా ప్రేమామృతంలో మునిగి తేలుతున్న గోపికలు.
వాళ్ళ ప్రపంచం వాళ్ళది. కాబట్టి వాళ్ళతో ఇబ్బంది వుండే ఆవకాశమే లేదు.
అయినా సరే రావ్ సాహెబ్‌గారు దిగాలుగా ఎందుకున్నారు?
ఏమయింది ఆయనకి? బాబావారు అదే అడిగారు.
నీకేమయింది అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నని బాబావారు ఎప్పుడు వేస్తారా అని ఎదురు చూస్తున్న రావ్ సాహెబ్ మనస్సులో మాట చెప్పాడు.
పిల్లల ధోరణి బాగా లేదన్నాడు.
**బాబా:** ఏంచేస్తున్నారేమిటి
**రావ్ సాహెబ్:** ఏం చెప్పమంటావ్ బాబా!
ఒకప్పుడు మీరంటే వాళ్ళకి ఎంత ప్రేమ, ఎంత భక్తి.
ఇప్పుడు అవేమీ కనబడటంలేదు.
ఇప్పుడు వాళ్ళు అల్లరి పిడుగులు. వీళ్ళు పిల్లలుకారు బాబా!
చిన్న దెయ్యాలు వీళ్ళు.
**బాబా:** వీళ్ళు ఇలా ఎందుకయ్యారు?
**రావ్ సాహెబ్:** ఏమో బాబా! నాకేం తెలుసు. వాళ్ళని పాడుచేసింది ఆలీ అక్బరు అనిపిస్తోంది. తా చెడ్డ కోతి వనమల్లా చెరచింది అన్నట్లు ఆలీ అక్బరు మిగతా ముగ్గురినీ చెడగొట్టాడనిపిస్తోంది. మీకు తెలుసుగా బాబా! ఆ నలుగురికీ మీ మాట వేదవాక్కు. ఎప్పుడూ మీరు చెప్పినట్లే చేస్తారు. ఇప్పుడు అదేమీ లేదు. మీ మాటని వాళ్ళు పట్టించుకోవటం లేదు. వీళ్ళని చూస్తుంటే అయ్యో! ఏమవుతున్నారీ పిల్లలు అని దిగులు వేస్తోంది. వీళ్ళకోసం మీరెంతో శ్రమపడ్డారు. ఆ శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరు అయిందనిపిస్తోంది బాబా!
బాబావారు అతన్ని బాధపడవద్దన్నారు. దైవీ ప్రేమ రెండవ దశలో ఎవరికైనా ఇంతే అవుతుందని పేర్కొన్నారు. ఈ దశ ఎంతోకాలం వుండదులే. కాస్తంత ఓపిక పట్టు అంతా సర్దుకుపోతుంది అని రావ్ సాహెబ్‌కి ధైర్యం నూరి పోశారు.
దిగులు పడవద్దన్నారు. పిల్లల ఆకతాయి తనం నీ సహనానికి పరీక్ష అనుకో.
వాళ్ళ పేరు చెప్పి, సహనం నేర్చుకో బాగా అన్నారు.
రావ్ సాహెబ్‌కి బాబావారి మాటలు అంతగా అర్థం కాలేదు.
అయితే, దైవీ ప్రేమ రెండవ దశ ప్రభావం వల్లనే పిల్లల ప్రవర్తన విపరీతంగా వుందన్న మాట కాస్తంత ఊరటనిచ్చింది.
మర్నాడు, జూన్ 12వ తేదీన బాబావారు మళ్ళీ కొత్త ప్రేమాశ్రమానికి వచ్చారు.
ఎప్పటిలా నడుస్తూ రాలేదు. సైకిల్‌పై వచ్చారు. బాబావారు సైకిల్ నడిపి ఎన్ని ఏళ్ళు అయిందో.

సైకిల్ త్రొక్కుతున్న బాబావారిని పిల్లలు ఎప్పుడూ చూడలేదు.
అందుకనే బాబావారు సైకిల్ దిగుతుంటే పిల్ల గోపికలు చప్పట్లు కొట్టారు.
అంతే వాళ్ళలో మార్పు వచ్చింది.
ఏమిటీ ఆ మార్పు అని అడిగితే, ఇదీ అని ఇదమిద్ధంగా చెప్పలేము కానీ,
వాళ్ళలో కొంచెం కుదురు వచ్చిందని మాత్రం చెప్పగలం.
అల్లరి తనం, ఆకతాయి తనం పోయాయి. ఒక్కసారిగా బాగా ఎదిగారీ పిల్లలు
అనిపిస్తోంది చూసే వాళ్ళకి. మన రావ్ సాహెబ్‌కి కావాల్సింది అదే కదా!
ఆశ్రమం స్కూల్లో చదువుకొన్న కుర్రాడు ఒకడు పెళ్ళికొడుకు అయ్యాడు.
బాబావారిని పెళ్ళికి రమ్మని ఆహ్వానించాడు. సరే వస్తానన్నారు. అన్నమాట ప్రకారం,
పెళ్ళికి వెళ్ళారు. ఇంతకీ పెళ్ళి ఎక్కడ అని అంటారా, ఇంక ఎక్కడ, ఆరంగావ్‌లోనే.
పెళ్ళి విందుకి మండలివారూ తరలివచ్చారు. వధువరులని ఆశీర్వదించాక,
అందరూ వలూ పవార్ ఇంటికి వెళ్ళారు. ఘుమఘుమలాడే వేడి వేడి టీ ఇచ్చింది
పవార్ సతీమణి. అందరూ టీ త్రాగుతుంటే, నౌసెర్వాన్ సాథా,
చిన్‌చోర్కర్ కాకా వచ్చారు, బాబావారిని దర్శించాలనిపించిందిట.
వెంటనే మెహెరాబాద్‌కి వచ్చాడట. ఆరంగావ్‌లో బాబావారున్నారని చెపితే,
ఇక్కడికి వచ్చారట. మీరాక నాకెంతో ఆనందం ఇస్తోందన్నారు బాబా.
ఈ మాట బాబావారి నోట వింటుంటే వాళ్ళు పొంగిపోయారు.
జీవితం ధన్యమయిందనుకొన్నారు. వాళ్ళు బాబా కార్యక్రమాలకి ఆర్థిక సహాయం
చేస్తున్నారు యథాశక్తి. బాబావారి మెప్పుకోసం చేస్తున్న పనికాదు ఆ సహాయం.
దైవీ మానవుడి విశ్వ కార్యక్రమానికి మేము సహితం సమిధులు కావాలనుకొన్నారు.
అందుకనే డబ్బు సాయం చేస్తున్నారు. కానీ ఈవాళ బాబావారు ఆ ఇద్దర్నీ పొగడ్తలతో
ముంచెత్తారు. మీరు చేస్తున్న డబ్బు సాయం నాకెంతగానో ఉపయుక్తంగా వుందన్నారు.
సంక్షోభంగా వున్న సమయంలోనే మహత్తరమైన ఆధ్యాత్మిక పని జరుగుతుంది అన్నారు.
సంక్షోభ సమయమే పరీక్షా సమయం కూడా అన్నారు.
కోర్కెలు తెచ్చే తంటాలు వివరించారు. కోర్కెలు తీరినా, తీరకపోయినా లాభం వుండదు
సరికదా హాని జరుగుతుందన్నారు. ఫలానాది కావాలనిపిస్తుంది.
అది దొరికాక అదొక రకమైన వెలితి కలుగుతుంది అన్నారు.
ఓ ఉదాహరణ చెప్పారు.
ఒక వ్యక్తి స్త్రీ పొందు కోరాడు. కాసేపటికి ఆ కోరిక మరింత బలపడింది.
తహతహ పెరిగింది. ఎప్పుడు తన కామవాంఛ తీరుతుందా అని ఎదురుచూస్తున్నాడు.
ఇంతలో ఒక స్త్రీ తారసపడింది. ఆమెతో సరస సల్లాపల్లో పడి, తన శారీరక వాంఛని
తీర్చుకొన్నాడు. స్త్రీ పొందుకోరాడు. స్త్రీ పొందు లభించింది. ఇహ కావాల్సింది

ఏమయినా వుందా! అంటే ఏమీ లేదనాలి.
అందుకనే అతగాడికి ఒక విధమైన నిరాశ, నిస్పృహ కలుగుతాయి.
ఇహ ఇప్పుడేమిచేయాలో తోచదు? గమ్మత్తుగా లేదు! కోరిక తీరేవరకూ,
ఎప్పుడు తీరుతుందా అని ఎదురు చూశాడు. తీరా కోర్కె తీరాక,
ఇహ ఇప్పుడేమిటి అన్న నిస్పృహ పట్టుకొంది. కోర్కె కలిగిన ప్రతిసారీ,
కోరిన కోర్కె తీరిన ప్రతిసారీ ఇలానే జరుగుతుంది.
ఒక కోరిక తీరగనే ఇంకో కోర్కె పుట్టుకొస్తుంది.
ఈ కోర్కెల వలయం నుంచి తప్పించుకోవడం ఆషామాషీ పనికాదు.
సద్గురువుల కృప వుంటే మనిషి కోర్కెల వలనుంచి బయటపడతాడు.
ఈ సృష్టిలో కోర్కెలని తుడిచిపెట్టగలవాడు సద్గురువు ఒక్కడే.
సద్గురువులు మాత్రమే భక్తుల, శిష్యుల కోర్కెలని నాశనం చేయగలరు.
సద్గురువు కృపకి ప్రాప్తమయిన వారికి కూడా ఈ వరం లభిస్తుంది అని బాబావారు
కోర్కెల అవధులు వ్యధల గురించి వివరించారు.
జూన్ 15వ తేదీ నుంచి బాబావారి కార్యక్రమంలో స్వల్ప మార్పు వచ్చింది.
అప్పటి వరకూ రాత్రిళ్ళు జోపిడీలో పడుకొంటున్నా బాబావారు,
ఈవాళ్టి నుంచీ సమాధి గొయ్యి గది తమ శయన మందిరం అన్నారు.
జూన్ నెల వర్షాలు తెస్తుంది ఎప్పుడూ. ఈ ఏడాదీ అంతే, వర్షాలు పేరుచెప్పి
గొయ్యి గది చూరునుంచి నీళ్ళు కారుతున్నాయి. దాంతో అక్కడ పడుకోవటం కష్టమైంది.
నీళ్ళ ట్యాంకిలో రెండు మూడు గదులున్నాయి కదా.
అక్కడికి మారారు. రాత్రి కాపలా పని గుస్తాద్ గారికీ, ఛాన్జీ గారికీ అప్పగించారు.
అప్పట్లో నగర్‌లో ఓ జిజ్ఞాసువు వుండేవాడు. అతని పేరు బిహారీలాల్ గంగారామ్
అగర్వాల్. బాబావారిని చాలాసార్లు దర్శించాడు.
మెహెరాబాద్‌లో అడుగుపెట్టిన ప్రతిసారీ ఒక మాట అనేవాడు, బాబావారి సేవలో
తరించాలని వుంది. అది ఎంత అదృష్టమో కదా అనేవాడు.
మనస్సులో మాట బాబావారితో కూడా చాలాసార్లు చెప్పాడు.
బాబావారు సరేలే అనేవారు కాదు. అలా అని ఇప్పుడు కాదు తర్వాత చూద్దామనీ
ఏనాడు అనలేదు. బిహారీలాల్ తన మనస్సులో మాట చెప్పిన ప్రతిసారీ
చిరునవ్వు నవ్వేవాడు. బాబావారి ఆంతర్యం అర్థంకాక
అతగాడికి ఏమీ పాలుపోయేది కాదు. ఈ జన్మకి ఇంతేనేమో అనుకుంటూ
వెనక్కి మళ్ళేవాడు. ఇలా చాలాసార్లు జరిగింది.
అయితే ఆ మధ్య వచ్చినప్పుడు బాబావారు బిహారీలాల్‌కి ఓ సలహా ఇచ్చాడు.
బంధాలన్నీ తెంచుకో, నా దగ్గరకు వచ్చేయ్ అన్నారు.

"అదెంత మహద్భాగ్యం బాబా! ఇప్పుడే ఇంటికి వెళ్ళి అన్ని బంధాలనీ వదిలించుకొని వస్తానని", ఇంటి ముఖం పట్టాడు. అలా నగర్‌కి వాపసు వెళ్ళిన బిహారీలాల్ జూన్ 17వ తేదీన మెహెరాబాద్‌లో అడుగుపెట్టాడు.
దూరం నుంచే బాబావారికి చేతులెత్తి నమస్కరించాడు.
"నేను వచ్చేశాను బాబా! అన్నీ వదిలించుకొని వచ్చేశాను,", అన్నాడు ఆనందంగా వెనక్కి వెళ్ళమని చెప్పకండి అని వేడుకొన్నాడు.
ఎందుకంటే, బాబావారు మనస్సు మార్చుకొని వెనక్కి వెళ్ళమంటారేమో నన్న భయం అతన్ని వదలనంటే వదలనంటోంది. ఈ అనుమానం మండలివారికీ వుంది.
బంధనాలు త్రెంచుకురమ్మని ఎవరికీ బాబావారు చెప్పలేదు గతంలో.
నిజంగా కావాలని అన్నారా? లేక ఈ బిహారీలాల్‌గారికి ఏదైనా పరీక్ష పెడుతున్నారా!
ఎవరికీ అంతుపట్టటం లేదు. అయితే బిహారీలాల్‌లో కపటం లేదు. బాబావారి పాదాల దగ్గరే శేష జీవితం గడపాలన్న పట్టుదల వుంది.
పాపం అతని ఆశని బాబా అడియాశ చేయరు కదా అనుకొన్నారు మండలివారు.
బాబావారు అతని ప్రార్థన వింటారా! మళ్ళీ వెనక్కి పంపేస్తారా! అని తల్లడిల్లిపోయాడు.
మరి బాబావారు వీరి మూగ బాధని విన్నారో లేక బిహారీలాల్‌పై నిజంగానే దయకలిగిందో ఏమో తెలియదు కానీ కనికరించారు.
మెహెరాబాద్‌లోనే ఉండమన్నారతన్ని. అలా అని ఎక్కువ రోజులు వుండనీయలేదు.
ఓ వారం గడిచిందో లేదో కొత్త పని పురమాయించారు.
అది ఎలా జరిగిందంటే, బిహారీలాల్‌ని పిలవండి అన్నారు.
కబురు అందగనే అతగాడు ఉరుకులు పరుగున బాబావారి సమక్షానికి వచ్చాడు.
వినమ్రంగా చేతులు కట్టుకొని నిలబడ్డాడు, నేలచూపులు చూస్తూ,
నేనేమయినా తప్పుచేశానా బాబా అని అడిగాడు.
తప్పు అయితే దండించండి బాబా అన్నాడు.
బాబావారు చిరునవ్వు నవ్వారు. కాస్తంత ఊరట కలిగింది మన మిత్రుడికి,
హమ్మయ్య బాబా వారికి నాపై కోపం లేదన్నమాట.
మరి ఎందుకు హడావుడిగా రప్పించారబ్బా అనుకొన్నాడు.
బాబావారు ఏ పనీ అకారణంగా చేయరు.
ఈ సంగతి బిహారీలాల్‌కి తెలుసు.
హజరత్ బాబాజాన్‌ని దర్శించి రమ్మన్నారు.
దర్శనం ఒక్కటే సరిపోదు.
ఆ తల్లిని నెల రోజులు సేవించమన్నారు.
అలానే ధునీలాల్ దగ్గరకి వెళ్ళు.

నెల రోజులు ఆ మహనీయుని పాదసేవ చేసిరా అన్నారు.
బిహారీలాల్ తలవూపాడు. ఎందుకు అని ఎదురు ప్రశ్నవేయలేదు సరికదా,
మీ ఆదేశం శిరసావహిస్తానన్నాడు. అప్పుడు బాబావారు ఒక మాట చెప్పారు.
ఆ మాట వింటుండగానే బిహారీకి అర్థమయింది.
బాబావారు పరీక్ష పెట్టకుండానే పరీక్ష పెడుతున్నారు.
ఆధ్యాత్మిక శిక్షణ ఇస్తున్నారని గ్రహించాడు.
ఇంతకీ బాబావారు అన్నమాట ఏమటనే కదా మీ ప్రశ్న పాఠకమహాశయా!
అయితే వినండి.
అది బాబావారు పెట్టిన నియమం హజరత్ బాబాజాన్ దగ్గరా,
ధుని వాలా దగ్గరా ఉన్నంతసేపూ,
మాధాకోళం చేసుకొనే కడుపు నింపుకో.
ఏ తల్లి పెట్టిన బిక్ష అయినా, అది నా ప్రసాదంగా స్వీకరించు. ఆనందంగా తిను.
అలా రెండు నెలలు గడిపి, తిరిగి రమ్మన్నారు.
దేని గురించీ బాధపడకన్నారు. బెంగ పెట్టుకోవద్దన్నారు.
నీవెక్కడున్నా నీ వెంటనే వుంటాను నేను అని భరోసా పలికారు.
బాబాజాన్, ధునివాలాలని సేవించి వచ్చాక ఏం చేయాలో చెప్పారు.
నువ్వు రాగానే ఇక్కడా అక్కడా కాదు నా జోపిడీలోనే వుందువుగాని అన్నారు.
జోపిడీలో కాస్తంత జాగాయిస్తాను.
నువ్వు నాతోనే వుండవచ్చు నిస్సంకోచంగా, నిర్భయంగా అని అంటూనే కొత్త షరతులు
చెప్పారు. రెండు నెలలు ఏకాంతవాసం చేయాలి.
జోపిడీలో ఏకాంత కాలంలో పాలు తప్ప ఇంకేమీ తీసుకోకూడదు.
మరి నీకు ఇష్టమేనా అని ప్రశ్నించారు.
మహదానందపడ్డాడు బిహారీలాల్. పరంధాముడు స్వయంగా తనతో ఉండమంటుంటే,
ఇంకేమి కావాలి ఎవరికైనా. ప్రభు సమక్షంలో వుంటే అది ఎన్ని రోజులయినా
ఇట్టే గిడిచిపోయినట్లవుతుంది. ఈ అదృష్టం అందరికీ దొరుకుతుందా.
పూర్వజన్మల సంస్కారాల ఫలితమేనా కారణం అని మహదానందపడ్డాడు.
మనస్సులో మాట ప్రభువుకి విన్నవించాడు.
మీమాట జవదాటనన్నాడు. మీరు ఎంత చెపితే అంత నాకు అన్నాడు.
మీ ఇచ్ఛానుసారం నడుచుకొనే శక్తిని ప్రసాదించమని ప్రార్థించాడు.
మనస్సు విప్పి చెప్తున్నాను బాబా!
మీరు చెప్పిన ప్రకారం చేస్తాను. నామాట నమ్మండి బాబా అని అన్నాడు.
బిహారీలాల్ ఆంతరంగం బాబావారికి తెలియకపోతే కదా.

అందుకనే అతగాడి మాటలకి ప్రసన్నులయ్యారు.
వెంటనే అతని యాత్రకి ముహూర్తం పెట్టారు.
అలా, బీహారీలాల్ గంగారామ్ అగర్వాల్ జూన్ 23వ తేదీన మెహెరాబాద్ నుండి పూనాకి బయలుదేరారు. తల్లి బాబాజాన్‌ను సేవించి ఆశీస్సులు తీసుకొన్నాక ధునిలాల్‌వారి దగ్గరకి వెళ్ళాలనుకున్నాడు.
ఇతగాడి ప్రయాణానికి ఓ రోజు ముందు, అంటే జూన్ 22వ తేదీన బాబావారు వ్యామోహం నుంచి బయటపడే మార్గాన్ని ఉపదేశించారు.
వ్యామోహం అంటే కేవలం కాంతా వ్యామోహమే కానక్కర్లేదు.
ధన వ్యామోహం కూడా కావచ్చు. అది జిహ్వా చాపల్యం కావచ్చు. జిహ్వా చాపల్యం కావచ్చు. అదీ ఇదీ కాకపోతే దృష్టి చాపల్యం కూడా వ్యామోహమేనన్నాడు.
నీకు చెందనిదాన్ని అతిగా ఆశించడం, ఆ వాంఛ అత్యాశగా మారడం, దురాశ కావడం కూడా వ్యామోహ పర్వంలో భాగమేనన్నారు.
వాంఛను జయించగలిగితే ఇంకేముంది నరుడే నారాయణుడు అవుతాడు.
ఇది అంత తేలిక కాదని మండలివారికీ తెలుసు.
అందుకనే కదా వారు బాబావారి పంచన చేరింది.
ఇంతకీ వ్యామోహం గురించి బాబావారు ఏమి చెప్పారో ఊహించగలరా పాఠకమహాశయా! ఎందుకులెండి ఆ శ్రమ మీకు.
ఈ యుగపు వాల్మీకి మాటల్లోనే ఆ కథ వినండి.
ఆశ దురాశల గురించి బాబావారు సూటిగా చెప్పలేదట.
వాంఛలని జయించటం ఎలాగో వివరించలేదట.
మరి ఏం చేశారు బాబా! ఏం చేశారంటే, ఓ కథ చెప్పారుట.
వాంఛ, మనో శక్తిల మధ్య హోరాహోరీ పోరాటం జరిగింది.
వాంఛ ముందు, మనోశక్తి నిలబడలేకపోయింది.
ఓడిపోయింది. అప్పుడు ఏం జరిగింది.
మనస్సు రంగప్రవేశం చేసింది. వ్యామోహంతో యుద్ధం చేసింది.
అదేమీ సాదాసీదా యుద్ధం కాదు. అదొక భయంకర పోరాటం.
మనస్సుని ఓడించడం ఆషామాషీ కాదు.
కానీ వాంఛ చేతిలో మనస్సు చిత్తుగా ఓడిపోయింది.
అయ్యో! ఇప్పుడు ఏంచేయాలి అనుకొంటుంటే, ఆత్మ ముందుకు వచ్చింది.
నాతో ఢీ కొట్టు, దమ్ముంటే అని వాంఛని ఛాలెంజ్ చేసింది.
మనస్సునే ఓడించగా లేనిది, నువ్వెంత అంటూ వాంఛ తొడ చరిచింది.
యుద్ధానికి సై అంది.

అలా ఆత్మ, వాంఛ బరిలోకి వురికాయి. కలబడ్డాయి.
ఆత్మ పిడిదెబ్బలకి, వాంఛ తట్టుకోలేకపోయింది. క్రిందపడింది.
గిలగిలా కొట్టుకొంది. అయినా లేవ బోయింది.
కానీ ఆత్మ వూరుకొంటే కదా! వాంఛని చితక కొట్టింది.
వాంఛ పైకిలేస్తే ఒట్టు.
ఇహ మళ్ళీ ఆత్మపైకి కాలు దువ్వలేదు.
ఇదీ పరమాత్మ చెప్పిన కథ.
వ్యామోహాన్ని జయించాలనుకొంటే సరిపోదోయి,
కాస్తంత పట్టుదల, మరికాస్తంత కృషి రెండూ సమపాళ్ళలో రంగరించాలి అని
బాబా వారు చెప్పకనే చెప్పారు.
ఏదో నా దగ్గర వున్నారు కాబట్టి మీపని అయిపోయిందనుకోకండి.
మీవంతు ప్రయత్నం కూడా అవసరం, అని మండలివారికి హెచ్చరిక చేశారు.
సరే, ఇహ మళ్ళీ మనం బాబావారి కథలోకి వస్తే,
పాఠకులకి గుర్తుంది కదా, బాబావారు మే నెలాఖరున క్వెట్టా నుంచి
మెహెరాబాద్‌కి తిరిగి వచ్చారు. అప్పటి నుంచి పిల్లలకి దూరంగా ఉంటున్నారు.
పిల్లలంటే బాబావారికి ఎంతో ఇష్టం. పిల్లలకి బాబావారే సర్వస్వం అయినా సరే
ఎందువల్లనో బాబావారు పిల్లలకి దూరంగా ఉంటున్నారు.
కనీసం, ఆఘా ఆలీని కూడా దగ్గరికి రానివ్వటం లేదు.
పిల్లల్ని కొండపైకి అనుమతించడం లేదు సరికదా
తమతో వ్యాహ్యాళికి కూడా తీసుకువెళ్ళటం లేదు.
మరి పిల్లలు ఈ ఎడబాటుని తట్టుకోలేకపోయారు.
ఏమి తప్పుచేశామని మాకీ శిక్ష బాబా అని కుమిలిపోయారు.
బాబాపై ప్రేమతో పిచ్చివాళ్ళయ్యారు. ఏదీ పట్టకుండాపోయింది.
చివరికి రావ్‌సాహెబ్ మాటని కూడా ఖాతరు చేయడంలేదు.
ఇలా ఒక్కరోజా రెండురోజులా వారాలు గడిచాయి.
పిల్లలకి దు:ఖం పెరిగింది. వరదలై పారింది.
ఏమిచేయాలో తెలియని పసితనం వారిది.
బాబావారే వాళ్ళకి సర్వస్వం. బాబావారు తప్ప మరేమీ తెలియదు, అక్కర్లేదు వాళ్ళకి.
కాని బాబావారు ఏమిచేసినా ఓ కారణం ఉంటుందనీ,
లోక కళ్యాణం కోసమే ఏపనైనా చేస్తారని తెలియని వయస్సు వాళ్ళది.
భౌతికంగా దూరంగా వుంచినా బాబావారు ఎప్పుడూ దూరంగా ఉండరు,
ఆధ్యాత్మికంగా ఎంతో దగ్గరగా వుంటారు.

ఈ ఎడబాటులో ఓ సందేశం వుంది.
ప్రభువు ఇచ్చ ప్రకారం నడుచుకోవాలి.
తద్వారా ప్రియతముని ప్రేమకి అర్హులు కావాలి.
ఈ ధర్మ సూక్ష్మం మన మెహెరాబాద్ ప్రహల్లాదులకి తెలుసా?
బహుశా తెలిసివుండకపోవచ్చు.
అందుకనే జూన్ 17వ తేదీన ఆలీ అక్బరు బాబావారి గొయ్యిగది దగ్గర నిలబడి బావురుమన్నాడు. వాడి ఏడుపుకి ఏకాంతం భంగమయింది.
బాబావారు బయటకి వచ్చారు.
పరంధాముని చూస్తూనే ఆలీ అక్బరుని దు:ఖం వదరలై పొర్లింది.
బాబావారు అతన్ని దగ్గరకి తీసుకొన్నారు. ముద్దాడారు.
ఎందుకురా ఏడుస్తున్నావ్, నేనున్నాగా నీదగ్గర అన్నారు.
అంతే మరింత హత్తుకుపోయాడు బాబావారికి.
మీదగ్గరే వుంటాను బాబా అన్నాడు.
మిమ్మల్ని వదిలి వుండలేనన్నాడు.
అలానే ఉందువుగానిలే అని ధైర్యం చెప్పారు.
నేను ఎప్పుడు కాదన్నానన్నారు.
రోజూ తమ దగ్గరకి రమ్మన్నారు.
తమ దగ్గరే రెండు గంటలు కూర్చోమన్నారు.
ఈ వరం ఎవరికీ చెప్పకు, చెప్పనని ఒట్టువేయమన్నారు.
అలానే బాబా. అంతకంటేనా?
మీరు చెప్పినట్లు చేస్తాను.
ఎవరికీ చెప్పను అన్నాడు.
అలా అయితే ఓ పదిరోజులపాటు రోజూ నా దగ్గరకిరా.
రెండు గంటలు నా సమక్షంలో గడుపు అన్నారు బాబా.
ఆలీ అక్బరు ఆనందంతో గంతులు వేశాడు.

**- సశేషం**

# కళంకారీ డోర్ కర్టన్‌లు

అవతారుని చిన్ముద్రతో అందమైన కళంకారీ పనితనంతో డోర్‌కర్టెన్‌లు తయ్యారుచేసినట్లు బాబా ప్రేమికురాలు శ్రీమతి లక్ష్మి, మచిలీపట్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క కర్టెన్ ఖరీదు రూ. 175. మరిన్ని వివరాలకు శ్రీమతి లక్ష్మి, 092470 2963 సంప్రదించగలరు.

# డాక్టర్ భరూచా!!

ఇది 1960 నాటి మాట. బాబా ప్రేమికుడు హెచ్.పి.భరూచా, నవసారి, గుజరాత్ బాబా ప్రేమికులందరికీ సుపరిచయమే. అవతారుడి గురించి అనర్గళంగా ప్రసంగిస్తాడాయన. అలాగే అనేక గ్రంధాల రచయిత డాక్టర్ భరుచా. ఇంతకీ విషయం ఏమంటే ఆయన మనస్సులో చిరకాలంగా ఒక కోరిక ఉండేది.అదేమంటే, ఆయనకి మోక్షప్రాప్తి కావాలనే చిన్న కోరిక మనస్సులో ఎంతోకాలంగా వుంది. ఒకరోజున ఈ విషయాన్నే ఆయన బాబా ముందుంచాడు. అందుకు బాబా ఒక ఏడాది ఆగమని ఆదేశించారు.

సరిగ్గా సంవత్సరం పూర్తికాగానే, తిరిగి భరుచా బాబా ముందు తన కోర్కెని ఉంచాడు. ఒక ఏడాది నిద్రపోకుండా వుండి తిరిగి తన దగ్గరకు రమ్మన్నారు బాబా.

**"Go without sleep for one full year.**

**Then come to me"** భరూచా గొప్ప పేరున్న వైద్యుడు. నిద్రపోకుండా వరుసగా వారం రోజులు ఉండటమే కష్టమైన పని. అలాంటిది ఒక సంవత్సరంపాటు నిద్రపోకుండా మెళుకువగా ఉండటం

తనవల్ల కాని పని అని అనుకున్నాడు. ఈ విషయాన్నే బాబాతో చెప్పాడు. ఏం ఫరవాలేదు. నా కృప నీపై ఉంటుందని భరోసా ఇచ్చారు. ఐనప్పటికీ, తెలివైన డాక్టర్ భరూచా, 'మోక్షం' గురించి ఆలోచన మానుకున్నాడు. తనకింకా తగిన సమయం ఆసన్నమవలేదని మిన్నకుందామనుకున్నాడు. తగిన సమయం వచ్చినప్పుడు, తగిన అర్హత వచ్చినప్పుడు అవతారుడే ఆ సంగతి చూసుకుంటాడని తృప్తి పడ్డాడు.అప్పటికింకా భరూచాకు తగిన అర్హత రాలేదని మెహెర్‌బాబా తనదైన శైలిలో తెలియజేశాడని సమీపంలోని బాబా ప్రేమికులు గుసగుసలాడుకున్నారు!!



# శ్రీ గూడా బాబాలో ఐక్యం

శ్రీ గూడా వెంకటరామయ్య (98) 2013 జూన్ 24న హైదరాబాద్‌లో బాబా నామజపంతో అవతారునిలో ఐక్యమయ్యారు. శ్రీ గూడా అవతారుడిని 1954లో తాడేపల్లిగూడెంలో తొలిసారిగా దర్శించుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో తహశీల్‌దార్‌గా పనిచేసి పదవీవిరమణానంతరం ఆయన కాకినాడలో స్థిరపడ్డారు. ఆరోజుల్లో కొన్నాళ్ళు అవతార్ మెహెర్ పత్రికకు సంపాదకులుగా పనిచేశారు. శ్రీ గూడా సుమారు 60 సంవత్సరాలు బాబా నామస్మరణలో గడిపారు. శ్రీ గూడా వారి అంత్యక్రియలు బాబా నామస్మరణతో ఎలాంటి కర్మకాండలూ లేకుండా నిర్వహించినట్లు ఆయన కుమారులు డా. జి.వి. రావు, జి.యస్. రాధాకృష్ణలు తెలిపారు.

# క్లిప్పింగ్



## అంతరిక్షంలో మరో సౌరకుటుంబం

లండన్: అంతరిక్షంలో మరో సౌరకుటుంబాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఒక నక్షత్రం చుట్టూ తిరుగుతున్న భూమిలాంటి గ్రహాలు మూడింటిని కనుగొన్నారు. ఇవి నివాసయోగ్యంగా ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ గ్రహాలు మనకు కేవలం 22 కాంతిసంవత్సరాల దూరంలో స్కార్పియాన్ అనే నక్షత్ర మండలంలో ఉన్నాయి. జర్మనీకి చెందిన గొట్టింజెన్, బ్రిటన్‌లోని హెర్ట్‌ఫోర్డ్‌షైర్ వర్శిటీలు సంయుక్తంగా జరిపిన పరిశోధనలో కొత్త గ్రహాల వివరాలు తెలిశాయి.

ఇటీవల ఈనాడు దిన పత్రికలో ప్రచురితమైన క్లిప్పింగ్ ఇది. 2013 మే సంచికలో ప్రచురించిన బ్రహ్మైక్యం సాధ్యం శీర్షికను మరోమారు పరిశీలించండి!!

# క్రొత్త పుస్తకాలు







మెహెర్‌శ్రీ డి. శ్రీనివాసరావు, శ్రీకాకుళం స్వేచ్ఛానువాదంలో రెండు క్రొత్త గ్రంధాలు

1. **మెహెర్ ప్రేమ ప్రవచనములు** (ఆనందనిధులు - మొదటి భాగము),
2. **ఆధ్యాత్మిక శిక్షణ కార్యక్రమం** (ఆనందనిధులు - రెండవ భాగము),

అవతార్ మెహెర్‌బాబా నరసన్నపేట కేంద్రం సహకారంతో ప్రచురించారు. కాగా, 88వ మౌన వార్షికోత్సవ సందర్భంగా ఈ గ్రంధాలను మెహెరాబాద్‌లో ట్రస్టు సభ్యులు శ్రీ జాల్ దస్తూర్, శ్రీమతి డాలీ దస్తూర్‌లు అవిష్కరించారు.

బాబా ప్రేమికులు యు.వి.రమణ మూర్తి, శ్రీ ఎన్.వి.వి.సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పుస్తకాల వెల అమూల్యం అన్నారు. పుస్తకాలు కావల్సినవారు శ్రీ డి. శ్రీనివాసరావు, మొబైల్ నంబరు 9441939827 సంప్రదించగలరు.

# డాక్టర్ ఘనీతో మా జ్ఞాపకాలు

**-ప్రతాప్ ఆహిర్, పూణే.**



## నవజీవనంలో...

నవజీవన సమయమది.

డాక్టర్ ఘనీ నవజీవనంలో పాల్గొనేందుకు సంసిద్ధత వ్యక్తం చేయలేదు.

కారణమంటూ ప్రత్యేకంగా ఏమీ లేదు. నవజీవనంలో వున్న కష్టనష్టాలు

ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు తనకులేవని ఘనీ మిన్నకున్నాడు.

ఈ విషయం బాబాకు తెలిసింది. నవజీవనంలో ఘనీ లేకపోవడం గొప్ప

లోటు కదా? అని ప్రశ్నించారు. అంతేకాదు ఘనీ తప్పకుండా నవజీవనంలో

పాల్గొనాలని తన **'అంగీకారం'** తెలపాల్సిందేనని బాబానే స్వయంగా ఘనీని కోరారు.

నవజీవనంలో ఎదురయ్యే కష్టాలను ఎదుర్కొనే సామర్థ్యం తన దగ్గర లేదేమోనన్న సంశయాన్ని బాబా ఎదుట కుండబ్రద్దలకొట్టినట్లు ఘనీ చెప్పాడు.

అంతేకదా! నేను నీకు అండగా వుంటానని బాబా భరోసా ఇచ్చారు.

ఇదంతా ఘనీపై బాబాకు గల ప్రేమ ఏపాటిదో తెలియజేస్తుంది.

నవజీవనంలో ఎదురయ్యే కష్టాలన్నింటినీ కళ్ళెదుట కనబడేలా చక్కని 'నవజీవన గీతం' రాసిన గొప్ప పండితుడు ఘనీ.

ఆ దరిమిలా బాబా ఆదేశానుసారం 1950 ఫిబ్రవరి 10న నవజీవనంలో నుండి బయటకొచ్చిన ఘనీ, ప్రతిరోజు తన అనుభవాలను, అనుభూతులను కడు రమ్యంగా మాకు చెబుతుండేవాడని ప్రతాప్ ఆహిర్ తన రచనలో పేర్కొంటాడు.

మేము ఆ రోజుల్లో బాబా ప్రేమికుడు ఎల్.బి. థాడే గారింట్లో సమావేశమయ్యేవాళ్ళం. శ్రీ థాడే వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేసేవారు.

ఆయనకి పూనే కంటోన్మెంట్ ఏరియాలో పోస్టాఫీసు ఎదురుగా ఓ పెద్ద గవర్నమెంటు క్వార్టరు ఉండింది. సెలవు రోజుల్లో మేమందరం ఆ క్వార్టర్సులో బాబావారి సత్సంగ్‌లో పాల్గొనేవాళ్ళం. ఆ కార్యక్రమానికి ఘనీ తప్పక వచ్చేవారు.
ఉర్రూతలూగించేలా బాబా గురించి అనేక విషయాలు ఆయన చెబుతుంటే మేం మైమరచి వినేవాళ్ళం.
మెహెర్‌బాబా సాక్షాత్తూ ఈ యుగావతారుడు, భగవంతుడు అని ఎన్నో దృష్టాంతాలుతో డాక్టర్ ఘనీ తన అనుభవాలు చెబుతుంటే మేం ఎంతో ఉత్సాహంగా వినేవాళ్ళమని ప్రతాప్ ఆహిర్ అన్నారు.

# కాంటాల యోగ

కాంటాల యోగ - ఇదో తలనొప్పి యోగ.
కాంటాల అంటే తలనొప్పి అని అర్థం.
కాంటాల అనేది మరాఠీ పదం.
బాబావారిచ్చే ఆదేశాలు కొన్ని తలనొప్పి తెప్పించేలాగా వుంటాయని ఘనీ గారి అభిప్రాయం. మంజిల్-ఇ-మీం నాటి రోజులవి.
ఆ రోజుల్లో బాబా ఒక ఆదేశం ఇచ్చారు.
అదేమంటే ఒక ముగ్గురు శిష్యులు వారికి పని ఏమీ లేనప్పుడు వచ్చి బాబావారికి ఎదురుగా ఒకరు, బాబాకు ఇరువైపులా చెరొకరు వచ్చి కూర్చోవాలని ఆదేశించారు. ఈ నియమం అన్నివేళలా - అన్ని కాలాలలో వర్తిస్తుందని బాబా స్పష్టం చేశారు. అంటే రైల్లో ప్రయాణిస్తున్నా, మంజిల్‌లో వున్నా ఆ ముగ్గురు శిష్యులు ముఖ్యంగా బాబావారు చెప్పినట్లు వచ్చి వారివారి స్థానాల్లో కూర్చోవాలి.
ఈ ఆదేశంలోని మర్మమేమిటో అవతారునికే ఎరుక వుంటుంది కదా!
ఐతే, నవజీవన సమయంలో అలహాబాద్ వైపు వెళ్తూ ఒక ఏకాంత ప్రదేశంలో బస చేసాం. ఆ ప్రాంతం ఎముకలు కొరికే చలితో వుంది.
ఆ సమయంలో బాబావారి ఆజ్ఞలు ఏమంటే,
తనతో వున్న వారందరూ తెల్లవారుఝామున 4 గంటలకు లేచి వారున్న చోటనే మెళుకువగా ఉండాలన్నారు.
తిరిగి ఓ గంట తర్వాత, ఐదు గంటలు కొట్టాక పడుకోవచ్చని సూచించారు.
మెళుకువగా వున్న ఆ సమయంలో బాబా బృంద సభ్యులు ఏం చేయాలి? అంటే ఏమీ లేదు! కేవలం మెళుకువగా మాత్రం ఉండాలి.
నిద్రపోరాదు! అంటే!! ఇదేమి చోద్యం అని,
ఇలాంటి బాబావారి ఆదేశాలను ఘనీ కంటాల యోగ అని అభివర్ణించారు.

1949 నవంబరు 22వ తేదీ. ఆ రోజున నవజీవనంలో వున్న ఘనీ బాబా బృందంతో కల్సి వారణాశిలో వున్నాడు. ఆ రోజు రాత్రి తనతో వున్న తోటివారందర్నీ నవ్విస్తూ ఘనీ నవజీవనంపై తేలికగా మాట్లాడాడు.
ఏమన్నాడనుకున్నారు?
ప్రతి నిత్యం మనం సాధారణంగా చేసుకుపోయే పనులన్నింటినీ **అకాలంలో** చేయడమే నవజీవనమని నిర్వచనం చెప్పాడు. కష్టాలు కొనితెచ్చుకోవడం నవజీవన విశేషాలలో ప్రధానం అన్నాడు. నున్నని రోడ్డుపై ప్రయాణిస్తూ కూడా ఎగుడుదిగుడు రోడ్లపై అనుభవించే ఆటుపోట్లు భరించడం నవజీవన యానం అని ముక్తసరిగా తనదైన శైలిలో నిర్వచించి అందర్నీ కడుపుబ్బా పకపకా నవ్వించారు.
ఈ మాటలన్నీ బాబావారి చెవులకు కూడా తాకాయి.
దాంతో ఆ మర్నాడు ఘనీని పిలిపించి, తన వాఖ్యలపై అభిప్రాయం ఏమని మరలా ప్రశ్నించారు. ఘనీ సహజ చతురుడిగా ప్రతీతి కదా!!
బాబావారి ప్రశ్నకు తనదైన శైలిలో ఘనీ చక్కగా ఇలా వివరించాడు.
బాబా!! ఎముకలు కొరికే చలిలో తెల్లవారుఝామున ఐదు గంటలకు టీ త్రాగాలని మీరన్నారు. ఆ తర్వాత ఇస్తే గిస్తే చపాతీ కూడా తినాలన్నారు. ఇందుకోసం మేమందరం ముక్కుతూ, మూల్గుతూ, కుర్రో, మొర్రో, మనుకుంటూ తెల్లవారుఝామున నాలుగున్నరకల్లా సిద్ధం అవుతున్నాం. పోనీ ఆ సమయంలో మేమీ భగవంతుని ప్రార్ధనలు, ఆరతి, హిందువులయితే సంధ్యావందనం, గాయత్రీ జపం, ముస్లింలయితే నమాజ్ ఇలా ఏమీచేయవల్సిన పన్లేదు. అలాంటప్పుడు తెల్లవారుఝామున నాలుగున్నరకల్లా మేమందరం లేవడం ఎందుకు బాబా అని సూటిగా ప్రశ్నించాడు.
ఘనీ బాబావారికి చిన్ననాటి స్నేహితుడు కూడా కదా.. బాబా దగ్గర ఆయనకు ఆ మాత్రం చొరవ వుంది.
ఈ మాటలు తోటి బాబా బృందాన్ని కేరింతలు కొట్టించింది. గట్టిగా నవ్వారు.
బాబా కూడా హాస్యప్రియుడు కదా! ఆయన కూడా ఘనీ మాటలతో నవ్వుకున్నారు.
ఆ రోజు రాత్రి పడుకోబోయేముందు బాబా బైదుల్‌ని పిలిచి ఆ మర్నాడు అందరికీ – టీ – ఉదయం 4.45 నిముషాలకు ఇవ్వమన్నారు.
అంటే ఆ చలికాలంలో మరో 15 నిముషాలు ముందరగా ఇవ్వమని ఆదేశించారు.
ఆ మర్నాడు, బాబా తన నవజీవన బృందంతో సమావేశమయ్యారు.
ఘనీ మాటలు మరోమారు జ్ఞాపకం చేశారు.
గత రాత్రి తనకు నిద్రపట్టలేదని బాబా అన్నారు.
తెల్లవారుఝామున 5 గంటలకు టీ త్రాగే విషయమై ఘనీ చేసిన వాఖ్యలపై మీరు ఆనందం పట్టలేక పకపకా నవ్వుతుంటే, నేనా విషయాన్ని

తీవ్రంగా ఆలోచించానన్నారు. ఘనీ మాటల్ని కేవలం ఒక జోక్‌లాగా తీసుకోవాలా లేదా సీరియస్‌గా ఆలోచించాలా? అన్న మీమాంశలో నేనున్నానని బాబా అన్నారు. ఘనీ మాటల్ని కేవలం జోక్‌గా, ఒక తేలికయిన విషయంగా హాస్యంగా తీసుకుని కడుపారా నవ్వుకుంటే నేను సంతోషిస్తాను. అలా కాకుండా, ఘనీ మాటలు సీరియస్‌గా తీసుకుని, తెల్లవారుఝామున ఐదు గంటలకు లేవడం వృథాప్రయాస అని, నా ఆదేశాలు శుద్ధ దండగ అని భావిస్తే, మీరు నవజీవన నియమావళిని ఉల్లంఘించినట్లౌతుందని బాబా గంభీరంగా ప్రశ్నించారు. ఇంత చిన్న విషయంపై బాబా ఇంతగా ఆందోళన చెందడం, గత రాత్రి నిద్రలేకుండా గడపడం బాబా శిష్య బృందానికి చాలా బాధ కల్గించింది. అందరూ ఒక్క క్షణం అవాక్కయ్యారు. దాంతో క్షమించమని వేడుకున్నారు. బాబా నీ ఆదేశాలు వెనుకగల అంతరార్థం మాకు అర్థం కావని ఒప్పుకున్నారు. మీ ఆదేశాలు అర్థం - పర్థం లేనివని కాని, శుద్ధ దండుగ అనికాని మేము ఎప్పుడూ భావించమని చెంపలేసుకున్నారు. దీంతో అక్కడి వాతావరణంలో ప్రశాంతత చిక్కినట్లయింది. ఆందోళన సద్దుమణిగింది. బాబా కూడా శాంతించారు.

గతం గత: అన్నారు.

అంతేకాదు, నవజీవనంలో బాబా తన చుట్టూవున్నవారిని అనుమానించానని, అందుకు శిక్షగా ఒకరిద్దరిని వచ్చి తన చెవి మెలిపెట్టమన్నారు.

అయాచితంగా తనవారిని అనుమానించానని బాబా భాదపడ్డారు.

అవతారుని సమక్షంలో ఆయన్నుండి నేరుగా ఆదేశాలు అందుకుని విధేయతతో అమలుచేయడం సామాన్యమైన విషయం ఏమాత్రం కాదు.

తన బృంద సభ్యుల ఆధ్యాత్మిక ఉన్నతికి అవతారుడిచ్చే ఆదేశాల ఆంతర్యం అందరికీ అవగతం కాదు కదా!

# జంతువులతో మచ్చిక

నవజీవనంలో కొంత దూరం బాబా బృందం కాలినడకన నడిచారు. సారనాథ్ నుండి జాన్‌పూర్ వరకూ గల 38 కిలోమీటర్ల దూరం కాలినడకన ప్రయాణం చేశారు. ఈ ప్రయాణంలో కొన్ని జంతువులు కూడా పాల్గొన్నాయి. ఒంటెలు, ఎద్దుల బండ్లు, రెండు ఆవులు, రెండు గార్ధబాలు, ఒక తెల్ల గుర్రం - ఇలా కొన్ని జంతువులున్నాయి. బాబా బృందసభ్యులు పురుషులు తెల్లని కఫ్నీని ధరించి, నెత్తిమీద ఆకుపచ్చని తలపాగా పెట్టుకున్నారు. తెల్లని బూట్లు వేసుకొని ముందుకు సాగుతుంటే చూసేవారికి ఒక వింతగా కనిపించేది. జంతువుల విషయంలో ఆ రెండు ఆవులు, రెండు గాడిదలు మాత్రం నడవలేక మొరాయించాయి. మొదటి రోజునయితే ఈ జంతువులు అంగుళం

కూడా ముందుకు నడవమని మొండికేశాయి. వాటిని ఎలాగో ఈడ్చుకుంటూ ముందుకు లాక్కెళ్ళాల్సి వచ్చింది. గాడిదలను నడిపించే బాధ్యత ఘనీకి అప్పగించారు.
ఈ బాధ్యతలో ఘనీ పూర్తిగా ఓడిపోయాడు. ఘనీలాంటి తెలివైన వాడిని గాడిదలు తమతో ఉండటం ఇష్టపడలేదంటూ పకపకా నవ్వుకున్నారు.
ఇదంతా చూస్తున్న బాబా ఘనీకి అప్పగించిన బాధ్యతల నుండి తప్పించి స్త్రీమండలివారు వస్తున్న ఎద్దుల బండిలో బండిని నడిపేవాని పక్కన కూర్చోమన్నారు.
ఘనీ ఆరోగ్యం ఆయన వయస్సు రీత్యా ఈ సౌకర్యం కల్పించారు.
ఐతే, అలా బండిలో వస్తూ, ప్రతి గ్రామం దగ్గరా ఆగి, స్థానిక గ్రామస్థుల దగ్గర్నుంచి “బిక్షం” అడుక్కోమన్నాడు బాబా!!
దీంతో మానవుల్లో వుండే సేవా భావం ఏపాటిదో తనకు తెలిసొచ్చిందన్నారు ఘనీ. స్థానిక ప్రజలు, వారెంత కష్టాల్లో వున్నా మేము **బిక్షాం దేహీ** అనగానే వారికున్నంతలో మాకు సహాయమందించారన్నారు. ఛీ పొమ్మనమని ఎవరూ ఛీత్కరించుకోకపోవడం వారి సంస్కారమని ఘనీ గ్రామస్థుల్ని కొనియాడారు.
ఆ తరువాత గాడిదలను స్త్రీమండలికి అప్పగించారు. ఐతే,
బరువైన సామాన్లు మోస్తూ గార్ధబాలు ఎలాంటి గొడవా చేయలేదని ఘనీ వాఖ్యానించడం గమనించాలి.

# ధన్యుండను

మెహెర్‌బాబా పుస్తకంపై బాబావారి చిత్రం చూసి ప్రాణం లేచివచ్చినట్లైంది. సుమారు 13 సంవత్సరాల తర్వాత అవతార్ మెహెర్‌బాబాను **మెహెర్‌బాబా** మాసపత్రికపై అవతారుడి దర్శన భాగ్యం కల్గినంత ఆనందం లభించిందని ఇటీవల ఒక పాఠకుడు మాకు ఫోన్ చేశాడు. సుమారు దశాబ్దం క్రితం తానెన్నో కష్టాలు అనుభవించానని, ఆ సమయంలో మెహెర్‌బాబా వారి దివ్య చరిత్రను చదివి ఉపశమనం పొందానని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో సిటీ బస్సులో వెడుతుండగా, (జూన్ 29) బస్సులో తోటి ప్రయాణీకుని చేతిలోవున్న మెహెర్‌బాబా జూన్ మాసం సంచికను చూసానని, నా ఆసక్తిని గమనించి తాను ఇప్పటికే ఆ పత్రికను చదివానని చెప్పి, మెహెర్‌బాబా మాస పత్రికను తనకిచ్చేసి లక్డికాపూల్ ప్రాంతంలో ఆయన దిగిపోయాడని, పుస్తకంపైవున్న ఫోన్ నంబరు చూసి మాకు ఫోన్ చేశానన్నాడు. ధన్యుడనయ్యానన్నాడు. ప్రస్తుతం తాను సన్యసించి చంద్రశేఖర స్వామినయ్యానన్నాడు. పూర్వాశ్రమంలో వారి పేరు వెంకన్న. స్వగ్రామం తుని అని చెప్పారు. బాబా వారి ప్రార్థనలు, సందేశాలు ఆధ్యాత్మికోన్నతికి దోహదపడతాయని ఆయన అన్నారు. ఆయన గారి ఫోన్ నంబరు 7396683355. వీలయితే మీరూ హలో చెప్పండి ఆ స్వామికి. ❀

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.

మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,

అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మావు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహా ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు బాబా కొంగును చిట్టచివరి వరకు దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యత్వం

**2013** జూన్ - జూలై నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | జూలై | పి. శ్రీధర్ రావు, హైదరాబాద్ | రూ. 1000.00 |
| 2. | జూలై | యం. బాలకృష్ణారావు, సికింద్రాబాద్ | రూ. 500.00 |
| 3. | జూలై | మెహెర్‌జీ, విజయవాడ | రూ. 500.00 |
| 4. | జూలై | చింతా నరసయ్య, నిర్మల్, అదిలాబాద్ జిల్లా | రూ. 500.00 |
| 5. | జూలై | కె.వి. నరసింహారావు, నరసరావుపేట | రూ. 1000.00 |
| 6. | జూలై | కె. ఎల్లయ్య, విజయనగరం | రూ. 1000.00 |
| 7. | జూలై | కంది రామక్రిష్ణ, బెంగుళూరు | రూ. 1000.00 |
| 8. | జూలై | కంది విశ్వనాధ్ మెహెర్‌బాబా, నెల్లూరు | రూ. 1000.00 |
| 9. | జూలై | యం.పి. శాంతిశ్వరూప్, విజయనగరం | రూ. 1000.00 |
| 10. | జూలై | బి. జగన్మోహన్‌రావు, విజయనగరం | రూ. 1000.00 |
| 11. | జూలై | డి. చిన్నారావ్, రాజాం, శ్రీకాకుళం జిల్లా | రూ. 500.00 |
| 12. | జూలై | జి. సౌభాగ్య, విశాఖపట్నం | రూ. 500.00 |
| 13. | జూలై | దండమూడి శ్రీకృష్ణ, ఏలూరు | రూ. 500.00 |
| 14. | జూలై | పి. మురళీమోహన్, చీపురుపల్లి | రూ. 500.00 |
| 15. | జూలై | తోట బాస్కరమ్మ, కాకినాడ | రూ. 1000.00 |
| | | మొత్తం | **రూ. 11,500.00** |

**పత్రిక సభ్యత్వం**

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-
2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు.
4. వార్షిక సభ్యత్వం రూ.100/- పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది.

**మా అడ్రస్: ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్-500087. ఫోన్:99595-53218, malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2012-2014, **Dt.19-12-2011**